
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు





వారంతా రెవెన్యూ ఉద్యోగులు.. ప్రజలు, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాల్సిన వాళ్లు.. అప్పట్లో వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తారు. తాము ప్రభుత్వాధికారులమనే కనీస భయం లేకుండా చేయకూడని పనులు చేశారు. నిబంధనలు పక్కనపెట్టి ప్రభుత్వ ఖజానాకు వందల కోట్లు నష్టం కలిగించారు. వైసీపీ నాయకులకు వందల కోట్లు ఆదాయం చేకూర్చి పెట్టారు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్లు.. తాము చేసిన నీతి బాహ్యమైన పనులను ఎవరూ చూడలేదని ధీమాగా ఉన్నారు. అయితే అప్పట్లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు వీళ్ల పాపాలను వెలుగులోకి తెచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వాస్తవాలు ఉన్నప్పటికీ వైసీపీ నాయకుల అండతో నామమాత్రంగా కేవలం బదిలీలతో బయటపడ్డారు. ఈ అక్రమాలపై అప్పట్లో సీసీఎల్ఏ వాళ్లందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయినా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండదండలతో విచారణ తూతూమంత్రంగా జరిపి నామమాత్రపు చర్యలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో తప్పులు చేసిన వాళ్లంతా ప్రస్తుతం మరోచోటుకి బదిలీ అయి ప్రశాంతంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పట్లో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వంలో మళ్లీ విచారణ జరిగేనా? దోషులకు సరైన శిక్షలు పడేనా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పెద్ద తప్పులు.. చిన్న శిక్షలు

- పెద్దిరెడ్డి అండతో బయటపడ్డారు
- కూటమి ప్రభుత్వంలో మళ్లీ కేసులు తిరగతోడతారా?
- దోషులకు సరైన శిక్షలు పడేనా?



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పీలేరు మండలంలో పెద్ద భూకుంభకోణం జరిగింది. పలువురు తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు ఈ కుంభకోణంలో ప్రధాన పాత్రదారులుగా మారారు. వైసీపీ నాయకులు ఇచ్చే లంచాలకు కక్కుర్తిపడిన రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు సహకరించారు. ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకోవడం, డీకేటీ భూముల్లో అక్రమంగా లేఔట్లు వేసి ప్లాట్లు విక్రయించడం, ఫోర్జరీ రికార్డులతో ఆస్తులను మార్చుకోవడం వంటి అక్రమాలకు సాయపడ్డారు. సుమారు 600 ఎకరాల్లో జరిగిన ఈ కుంభకోణంలో సుమారు 400 కోట్ల రూపాయలను వైసీపీ నాయకులు దండుకున్నారు. పీలేరు గ్రామ పంచాయతీ, పీలేరు పట్టణం చుట్టూ ఉన్న బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె, ఎర్రగుంట్లపల్లె, దొడ్డిపల్లె, ముడుపులవేముల పంచాయతీల్లో ఈ అక్రమాలు జరిగాయి.

అయితే ఈ కుంభకోణంలో పై స్థాయి నుంచి కింది స్థాయి అధికారుల పాత్ర ఉండడంతో చాలా రోజుల పాటు బయటపడలేదు. అయితే 2021లో ప్రస్తుత పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఈ అక్రమాలను వెలుగులోకి తెచ్చారు. దీంతో అప్పటి చిత్తూరు కలెక్టర్ హరినారాయణ విచారణకు ఆదేశించారు. అప్పటి మదనపల్లె సబ్ కలెక్టర్ జాహ్నవి సుమారు 80 మంది రెవెన్యూ సిబ్బందితో మూడు వారాల పాటు విచారణ జరిపి అక్రమాలు నిజమే అని తేల్చారు. విచారణలో 209.79 ఎకరాల్లో అనధికార లేఔట్లు, 158.19 ఎకరాల చుక్కల భూముల్లో అక్రమాలు, 129.40 ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణ, 103.99 ఎకరాల్లో డీకేటీ భూముల నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చారు. కేవలం 129.40 ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణల ద్వారానే ప్రభుత్వానికి దాదాపు రూ.90.58 కోట్లు (ఇది ప్రభుత్వ లెక్కల ప్రకారం) మేర నష్టం జరిగినట్లు తేల్చారు. ఈ అక్రమాల వల్ల కొందరు వైసీపీ నాయకులు సుమారు 400 కోట్ల రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పలువురిపై చర్యలకు సిఫార్సు

ఈ స్థాయిలో అక్రమాలు జరిగినా ఉద్దేశ్యపూర్వకంగానే పట్టించుకోలేదనే ఆరోపణలపై సబ్ కలెక్టర్ 12 మంది రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నారు. తహసీల్దార్లు పుల్లారెడ్డి, వెంకటరమణ, ఏఆర్ఐ అబ్దుల్ ఖాదర్, ఆర్ఐ భార్గవి, వీఆర్వోలు కె.శ్రీనివాసులు, ఎం.ప్రసాద్ బాబు, పి.రవిప్రసాద్, ఎల్.నవీన్ కుమార్, కె.మురళీకృష్ణ, ఎన్.సురేశ్‌కుమార్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, ఎం.శాంతకుమార్‌లపై చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నారు.

పెద్ద తప్పు.. బదిలీతోనే సరి

ఉద్దేశ్యపూర్వకంగానే అధికారులు అక్రమాలకు సహకరించారని విచారణలో తేలింది. దీంతో వీళ్లందరిపైనా కఠిన చర్యలు తీసుకుంటారని అనుకున్నారు. అయితే అక్రమాలకు పాల్పడిన వారిని ఎవరి ఆపన్నహస్తం ఆదుకుందో? కానీ కేవలం వీళ్లందరినీ పనిచేస్తున్న చోట నుంచి బదిలీ చేశారు. బదిలీ చేయడమే పెద్ద శిక్ష అన్నట్లు వదిలేశారు. మూడు వారాల పాటు పెద్ద సంఖ్యలో రెవెన్యూ సిబ్బంది చేసిన విచారణ, సబ్ కలెక్టర్ విచారణా నివేదికలు బుట్టదాఖలయ్యాయి. నామమాత్రపు చర్యలతో వదిలేయడంతో అక్రమాలకు పాల్పడి అక్రమార్కులకు సహకారం అందించిన ఉద్యోగులు ప్రశాంతంగా పీలేరు నుంచి వెళ్లిపోయి మరోచోట ఉద్యోగం చేసుకుంటున్నారు.

సీసీఎల్ఏ ఆదేశించినా అవే చర్యలు

నామమాత్రపు చర్యలపై అప్పటి ప్రతిపక్ష పార్టీ నాయకులు లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటి సీసీఎల్ఏ ముఖ్యకార్యదర్శి అక్రమార్కులపై కొరడా ఝుళిపించారు. సబ్ కలెక్టర్ విచారణలో తేలిన బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే అప్పట్లో ఈ అక్రమాలకు సహకరించిన వారందరూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శరణు కోరినట్లు సమాచారం. దీంతో వాళ్లందరిపైనా ఎటువంటి తీవ్ర చర్యలు తీసుకోలేదు. కేవలం బదిలీతోనే సరిపెట్టారు. గత ఎన్నికల వరకు వైసీపీ ప్రభుత్వమే ఉండడంతో వీళ్లందరూ ప్రశాంతంగా విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో ఈ అక్రమాలపై మళ్లీ విచారణ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత అధికార పార్టీలోని ముఖ్యులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పుడైనా ఈ అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై సరైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టండి

- నేర సమీక్షలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నేర సమీక్షా సమావేశానికి హాజరైన పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 28: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టడంతో పాటు కేసుల్లో పురోగతి సాధించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారుల నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని రికవరీ శాతాన్ని పెంచాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో పలు కేసులను సమీక్షించి తీవ్ర నేరాలతో ఉన్న కేసుల దర్యాప్తు వివరాలు, కోర్టులో చార్జిషీట్ దాఖలు, ప్రస్తుతం కోర్టులో ట్రయల్ ఏ దశలో ఉన్నాయి వంటి వివరాలు అడిగి తెలుసుకొని సంబంధిత సీడీ ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. తీవ్ర నేరాల కేసుల్లోని వారిపై నిరంతర నిఘా ఉంచి యాక్టివ్‌గా ఉన్న వారిని బైండోవర్ చేయాలని సూచించారు. హత్య, రేప్, ప్రాపర్టీ, గంజాయి తదితర గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు, నిందతుల అరెస్టులపై సర్కిల్ వారీగా పోలీసు అధికారులను ఆరా తీసి అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలని తెలిపారు. తరచుగా దొంగతనాలు, దారి దోపిడీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సంబంధిత ఎస్‌డీపీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. పోక్సో కేసులకు సంబంధించిన నిందితులపై కేసు నమోదు చేసిన వెంటనే అరెస్టు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా పెండింగ్ ఉండరాదని, ఎస్‌డీపీవోలు ప్రతి వారంలో ఒక రోజు తమ సబ్ డివిజన్ పరిధిలోని పోక్సో కేసుల స్థితిగతులపై సమీక్ష చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహన తనిఖీలు చేపట్టి చలానాలు విధిస్తూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చేయాలని, రాత్రి గస్తీ పెంచి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా ఉంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్ట పరిధిలో న్యాయం చేయాలని, ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం కలిగే విధంగా సేవలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

‘హలో మదనపల్లె’

- వీనులవిందైన పాటలు, విలువైన సమాచారం
- త్వరలో మదనపల్లెకు మూడు ఎఫ్ఎం రేడియో స్టేషన్లు
- మిట్స్ ఎఫ్ఎంకు తోడుగా మరో మూడు ఎఫ్ఎం స్టేషన్లు



మదనపల్లె టౌన్, ఆగస్టు 28: మదనపల్లె పట్టణానికి మూడు ఎఫ్ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు అనుమతిస్తూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దేశవ్యాప్తంగా 234 నగరాల్లో కొత్త ఎఫ్ఎం (ఫ్రీక్వెన్సీ మోడ్యులస్) రేడియో స్టేషన్ల ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, ప్రధాన పట్టణాల్లో మొత్తం 68 కొత్త ఎఫ్ఎం స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అన్నమయ్య జిల్లాలో 2.50 లక్షల మంది జనాభా ఉన్న ప్రధాన పట్టణం మదనపల్లెలో మూడు ఎఫ్ఎం రేడియో స్టేషన్‌ల ఏర్పాటుకు ఉత్తర్వులు వచ్చాయి.

ఏఐఆర్‌కు దీటుగా ఎఫ్ఎం రేడియో

దేశవ్యాప్తంగా గతంలో ఆలిండియా రేడియో నుంచి ఏఎం (యాంప్లిట్యూడ్ మోడ్యులేషన్) తరంగాలతో వార్తలు, పాటలు, ఇతర సమాచారం ప్రసారమయ్యేది. మారుతున్న ఆధునిక సాంకేతికతతో ఫ్రీక్వెన్సీ మోడ్యులేషన్ తరంగాలతో ఎఫ్ఎం రేడియో స్టేషన్లు వచ్చేశాయి. ఎఫ్ఎం రేడియో స్టేషన్ల ద్వారా ప్రసారమయ్యే అంశాలు ఎక్కువ ఫిడిలిటి, కచ్చితత్వంతో, ఒరిజినల్ ప్రోగ్రామ్‌తో స్పష్టంగా శ్రోతలకు వినపడేలా ప్రసారాలు చేస్తుంది. దీంతో ఆలిండియా రేడియో కూడా (ఏఎం) నుంచి ఎఫ్ఎం దిశగా తన అడుగులు మార్చుకుంది. ముఖ్యంగా ఎఫ్ఎం రేడియో స్టేషన్‌లు 88 నుంచి 108 ఎంహెచ్‌జెడ్ బ్యాండ్‌లలో ప్రసారమవుతాయి. ఎఫ్ఎం రేడియో స్టేషన్‌లలో కూడా రెండు రకాలు ఉన్నాయి. వైడ్‌బ్యాండ్ ఎఫ్ఎం రేడియో స్టేషన్, న్యారో బ్యాండ్ ఎఫ్ఎం రేడియో స్టేషన్‌లుగా విభజించారు. ఈ రెండింటిలోను వాటికవే ఉపయోగాలు ఉన్నాయి. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాలకు మాత్రమే పరిమితమైన ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఇప్పుడు అదనంగా 68 ప్రధాన పట్టణాలకు విస్తరించనున్నాయి.

ఎఫ్ఎం రేడియో ద్వారా వినోదాలు ఎన్నో..

ఎఫ్ఎం రేడియో ద్వారా స్థానికంగా జరిగే కార్యక్రమాలు, స్థానిక వ్యాపారాల ప్రచారం, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు శ్రోతలను ఉర్రూతలూగించే పాటలు, సంగీతం, ఇతర సమాచారాన్ని ప్రసారం చేయొచ్చు. మదనపల్లె ప్రాంతంలో ఇప్పటికే మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి (మిట్స్ కళాశాల) ఆధ్వర్యంలో 90.8 ఎంహెచ్‌జెడ్ బ్యాండ్ కింద 0.05 కేడబ్ల్యూతో ఎఫ్ఎం రేడియో స్టేషన్ నడుస్తోంది. ఎఫ్ఎం రేడియో స్టేషన్ల ఫ్రీక్వెన్సీని బట్టి ప్రసారాల దూరం అంచనా వేయొచ్చు. చిన్న చిన్న ఎఫ్ఎం రేడియో స్టేషన్లు 3 నుంచి 4 మైళ్ల ప్రసార సామర్థ్యం ఉండగా, పెద్దపెద్ద ఎఫ్ఎం స్టేషన్లు 60 మైళ్ల దూరం పాటు ప్రసారాలు చేయగల సామర్థ్యం ఉంటాయి. మిట్స్ ఎఫ్ఎం రేడియో స్టేషన్ 10-15 కిలోమీటర్ల రేడియస్‌లో ప్రసారాలు చేస్తుంది. మిట్స్ రేడియో మొబైల్ యాప్ ద్వారా మొబైల్‌లో వినొచ్చు.

మూడు ఎఫ్ఎం రేడియోస్టేషన్లకు అనుమతి

మదనపల్లెలో మూడు ఎఫ్ఎం రేడియో స్టేషన్లకు అనుమతిస్తూ కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్ఎం స్టేషన్ ఏర్పాటు చేయగోరే వారు ఆరు నెలల పాటు నిర్వహించి ఉండాలి. కనీసం రోజుకు 16 గంటల పాటు ప్రసారం చేయగలిగేలా ఉండాలి. దీంతో పాటు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖచే జీవోపీఏ (వాలిడ్ గ్రాంట్ ఆఫ్ పర్మిషన్) తీసుకోవాలి. దీంతో పాటు వైర్‌లెస్ ఆపరేటింగ్ లైసెన్స్ తీసుకుని ఉండాలి. వీటితో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.



బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 28: సమాజ ఆర్థిక అభివృద్ధితో పాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొదటి త్రైమాసికం జూన్ 30వ తేదీ నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.3430 కోట్లకు గాను 4520.68 కోట్ల రుణాలు మంజూరు చేసి 128 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి మొదటి ఆర్థిక సంవత్సరానికి త్రైమాసికం నాటికి వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.2,425 కోట్లు లక్ష్యానికి గాను రూ.3,134 కోట్ల రుణాలు అందజేసి 124 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని తెలిపారు. జూన్ మాసంలో పురోగతి సాధించేందుకు సహకరించిన బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ లావాదేవీలు మరింత బలోపేతం చేయాలన్నారు. బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'స్టాండప్ ఇండియా', ముద్ర, గ్రామీణ ఖాదీ బోర్డు వంటి పథకాలతో పాటు పంట రుణాలు, విద్యారుణాలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. అనంతరం రిజర్వు బ్యాంక్ స్థాపించి 90 సంవత్సరాలు అయిన సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు నిర్వహించే క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు ఎస్‌బీఐ ఆర్ఎం మురళి, నాబార్డు ఏజీఎం వినయ్‌విహార్, నవీన్‌కుమార్, మేనేజర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణంలో వేగం పెంచాలి

- ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఆనందరెడ్డి



మెడికల్ కాలేజి భవన నిర్మాణాలపై సూచనలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఆనందరెడ్డి

మదనపల్లె టౌన్, ఆగస్టు 28: మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజి భవనాల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఆనందరెడ్డి ఇంజనీర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక సర్వజన బోధనాస్పత్రి పైఅంతస్థులో నిర్మించిన కొత్త భవనాలను ఎస్ఈ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడక్కడా మిగిలిపోయిన ప్యాచ్ వర్కులను గుర్తించి వెంటనే పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున అధికారులతో సమావేశమయ్యారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఇచ్చిన గడువులోపు ఏయే నిర్మాణ పనులు పూర్తి చేయాలో ప్రిన్సిపాల్‌ను అడిగి నమోదు చేసుకున్నారు. ఎన్ఎంసీకి అనుమతికి అవసరమైన నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. 80 అదనపు పడకల గదుల కోసం నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వీటిని డీఐఈసీ భవనంపై నిర్మించేందుకు పరిశీలిస్తామన్నారు. ఐసీయూ విభాగానికి అదనంగా 60 పడకలు అవసరమని ప్రిన్సిపాల్ ప్రతిపాదనలపై నివేదికలను తీసుకుంటామన్నారు. అనంతరం ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజి భవనాలు, బోధనా తరగతుల భవనాలు, ల్యాబ్‌లు, విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణాలను ఎస్ఈ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పోతబోలులో సర్టిఫికెట్ల తిరస్కరణపై విచారిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



సర్టిఫికెట్ల తిరస్కరణపై సబ్ కలెక్టర్ విచారణ

మదనపల్లె టౌన్, ఆగస్టు 28: మదనపల్లె మండలంలో ఐదు నెలల్లో వివిధ సర్టిఫికెట్ల కోసం చేసిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు తిరస్కరించడంపై సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సుమోటోగా విచారణ చేపట్టారు. మదనపల్లె మండలంలో ఐదు నెలల కాలంలో ప్రజలు అన్ని రకాల సర్టిఫికెట్లు (కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు) కోసం 21 వేల మంది దరఖాస్తు చేసుకోగా వీటిలో 6 వేల దరఖాస్తులను వివిధ కారణాలతో రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. ఈ క్రమంలో వీటిపై సుమోటోగా స్వీకరించిన సబ్‌కలెక్టర్ బుధవారం మండలంలోని పోతబోలు, కొత్తవారిపల్లె గ్రామాల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరిని విచారించడంతో పాటు గ్రామ సచివాలయాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. ఏ కారణాలతో ఇంత పెద్ద మొత్తంలో సర్టిఫికెట్లను తిరస్కరించారో వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్‌లను వివరణ అడిగారు. అధికారులు మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరు చనిపోయారని, కొందరి డేటా సరిగ్గా లేదని, మరికొందరు గ్రామాల్లో లేరని సబ్‌కలెక్టర్‌కు వివరించారు. దీనిపై సమగ్రంగా విచారించి నివేదికలు పంపాలని తహసీల్దార్ ఖాజాబీని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వోలు ప్రసాద్, విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలమల్లలో తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

- హాజరవుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఎర్రగుంట్ల, ఆగస్టు 28: తెలుగుభాషా దినోత్సవ వేడుకలు కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని కలమల్లలో గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి తెలుగు శాసనం లభ్యమైన కలమల్ల చెన్నకేశవ, కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి, వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ వేడుకలు జరగనున్నాయి. బహుభాషా కోవిదుడు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తుండటంతో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. వర్షం వచ్చినా తడవకుండా సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వచ్చే తెలుగుభాషా పండితులు, ప్రజాప్రతినిధులు ప్రజలు కూర్చునేందుకు షామియానాలు, కుర్చీలు వేయించారు. కలెక్టర్ లోతేటి శివశంకర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి, జిల్లాలోని ఇతర శాసనసభ్యులకు ఆహ్వానాలు పంపినట్లు సమాచారం. పంచాయతీరాజ్ ఈఈ శ్యాంసుందర్, డీఈ భాస్కర్‌రెడ్డి, ఎన్డీయే కూటమి నాయకులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సేల్స్ రంగంలో రాణించాలనుకునే
యువతీ యువకులకు మంచి అవకాశం
మీరు చేయాల్సిందల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే.
ఆసక్తి, ఉత్సాహము గల అభ్యర్థులకు సేల్స్ రంగంలో మెళకువలను నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును
- బుక్ చేసిన కాపీ ఒక్కొంటికి రూ. 200/- చొప్పున కమిషన్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరు నెలకు సుమారు రూ. 20,000/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు
- ప్రయాణపు ఖర్చులు అదనంగా ఇవ్వబడును.

అర్హతలు
1) 19 సం.రాలు నుండి 25 సం॥రాల మధ్య వుండాలి.
2) తెలుగు అనర్గళంగా మాట్లాడగలగాలి
3) పదవతరగతి పాస్ / ఫెయిల్, ఆపైన

ఇంటర్వ్యూ తేది : 30-08-2024
సమయం : ఉ 10.00 గం॥ నుండి మ॥ 2.00గం॥ వరకు
ఆంధ్రజ్యోతి కార్యాలయం
సర్వే నెం. 717 బి/5, తూకివాకం గ్రామం & పోస్టు, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా - 517 520, తిరుచానూరు బైపాస్, టొయోటా షోరూం దగ్గర,
వివరాలకు క్రింది నెంబరును సంప్రదించగలరు.
Circulation Manager : 9985411592

సేల్స్ రంగంలో రాణించాలనుకునే
యువతి, యువకులకు మంచి అవకాశం
మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే
ఆసక్తి, ఉత్సాహముగల అభ్యర్థులకు సేల్స్ రంగంలో... మెళుకువలు నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును.
- బుక్ చేసిన కాపీ ఒక్కొంటికి రూ. 200/- చొప్పున కమీషన్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరు నెలకు సుమారు రూ. 20,000/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు.

-: అర్హతలు :-
- 19 సం॥రాల నుండి 25 సం॥రాల మధ్య ఉండాలి
- తెలుగు అనర్గళంగా మాట్లాడగలగాలి.
- పదవ తరగతి పాస్ ఆపైన

-: పనిచేయవలసిన ప్రాంతం :-
కడప జిల్లా మరియు అన్నమయ్య జిల్లా
ఇంటర్వ్యూ తేది : 29-08-2024
సమయం : ఉ॥ 10.00 గం॥ల నుండి 2.00ల వరకు
-: సంప్రదించవల్సిన చిరునామా :-
ఆంధ్రజ్యోతి కార్యాలయం
డోర్ నెం. 2-2495/2, సెకండ్ ఫ్లోర్, నాగరాజుపేట, కడప, సెల్ : 99854 11184

రాష్ట్ర స్థాయి ఆర్చరీలో నెంబర్1

మూడేళ్లుగా రాష్ట్రస్థాయికి మున్సిపల్ హైస్కూలు ● స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌కు ఎంపిక
క్రీడా చరిత్రలో వరుసగా ర్యాంకుల పంట ● నేడు అవార్డుల ప్రదానోత్సవం



ఆర్చరీలో జాతీయ స్థాయి పోటీల్లో పూర్వ విద్యార్థి రిషికిరణ్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: స్థానిక మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) రాష్ట్రంలో మొదటి స్థానం కైవశం చేసుకుంది. మూడేళ్లగా రాష్ట్ర స్థాయికి ఎంపికవుతూ క్రీడా పురస్కారాలతో వరుస ర్యాంకుల పంట పండిస్తూ స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌కు ఎంపికైంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు చదువు, క్రీడల్లోనూ విశేష ప్రతిభ చాటుతూ జాతీయ క్రీడా దినోత్సవ పోటీల్లో 1040 పాయింట్లతో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ప్రతిభా అవార్డులు అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2023 - 24 విద్యాసంవత్సరంలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు రాష్ట్ర స్కూలు గేమ్స్ అవార్డులకు ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభ పురస్కారానికి ఎంపికైంది.

కృషికి తగ్గ ఫలితం



మున్సిపల్‌హైస్కూలు మెయిన్ పాఠశాలకు బదిలీపై వచ్చి రెండేళ్ల పాఠశాల పరిస్థితులు అవగాహన చేసుకుని విద్యార్థుల్లో క్రమశిక్షణ, క్రీడల్లో ప్రోత్సహించా. 2014 నుంచి 22 రకాల ఆటల పోటీలపై వారిని ఉత్తేజపరిచి వారికనుగుణంగా ఆటలను నేర్పించాను. ఇప్పటి వరకు ఎందరో అంతర్జాతీయ, జాతీయ రాష్టస్థాయిలో పతకాలు సాధించారు. విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల ఎంతో సంతోషంగా ఉంది. చేసిన కృషికి ఫలితం దక్కినట్లైంది.

- ఫిజికల్ డైరెక్టరు లక్కిరెడ్డి వెంకటలక్ష్మి

వరుసగా ర్యాంకుల పంట

క్రీడా చరిత్రలో మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు వరుసగా ర్యాంకులు సాధిస్తూ తమదైన ముద్రను వేసుకున్నారు. 2014-15 విద్యాసంవత్సరం నుంచి జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభ పురస్కారాలకు ఎంపికవుతూనే ఉన్నారు. 2014 నుంచి ఏటా ప్రథమ స్థానంలో నిలుస్తూ సత్తా చాటుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో వివిధ క్రీడల్లో అండర్14, అండర్ 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ఒక్క పాఠశాల నుంచే 202 మంది విద్యార్థులు పాల్గొనగా రాష్ట్రస్థాయిలో 53 పతకాలు, జాతీయ స్థాయిలో 6 పతకాలు సాధించి మొత్తం 59 పతకాలతో 1040 పాయింట్లతో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచారు.

అవార్డుల పరంపర...

రాష్ట్రస్థాయి క్రీడా ఎక్సలెన్స్ అవార్డులను 2021-22 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. అయితే 2021-22, 2022-23 విద్యాసంవత్సరంలో వరుసగా రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ మెయిన్ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. 2023-24 విద్యాసంవత్సరంలో 1040 పాయింట్లు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచి సత్తాను చాటుకున్నారు. పాఠశాల విద్యార్థులు క్రీడలే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించడం విశేషం. రాష్ట్రస్థాయి సింగింగ్, డ్యాన్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి

జిల్లాలో నెంబవర్ వన్....

జిల్లాలో 2023-24కు మున్సిపల్ హైస్కూలు మెయిన్ రాష్ట్రస్థాయిలో నెంబర్‌వన్‌గా నిలిచింది. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొన్న క్రీడాకారులకు వచ్చిన పాయింట్ల ఆధారంగా క్రీడా ప్రతిభ అవార్డులను ప్రకటించారు. ఈ అవార్డులకు జిల్లా వ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా, ఐదింటిని ఎంపిక చేశారు. ప్రథమ స్థానంలో కడప మున్సిపల్ హైస్కూలు మెయిన్ 1040 పాయింట్లతో నిలిచింది. ప్రొద్దుటూరు బీబీసీఎస్ మున్సిపల్ హైస్కూలు 174 పాయింట్లతో ద్వితీయ స్థానంలోనూ, 172 పాయింట్లతో మైదుకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచింది చెన్నూరు మండలం రామనపల్లె జడ్పీ హైస్కూలు 146 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలవగా ఎర్రగుంట్ల జడ్పీహైస్కూలు 137 పాయింట్లలో ఐదో స్థానంలో నిలిచింది.

విద్యార్థుల కృషి అభినందనీయం



తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం, వారు చేస్తున్న కృషి అభినందనీయం. వ్యాయామ ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సాహంతో పిల్లలకు ప్రోత్సహిస్తూ వారు క్రీడల్లో అభివృద్ధి పొందడానికి చేస్తున్న కృషి కూడా అభినందనీయము.

- ప్రధానోపాధ్యాయురాలు నాగమణి

నేడు ప్రదానోత్సవం

వైఎస్ఆర్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం థర్మల్ పవర్ ప్లాంటులో గురువారం ప్రతిభ పురస్కారాల బహుమతి ప్రధానోత్సవం నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన పాఠశాలలకు మొమెంటోలు అందిస్తారు. అయితే రాష్ట్రస్థాయిలో బహుమతి ప్రధానోత్సవం ఎప్పుడు జరుగుతుందన్నది త్వరలో రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించనుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమశాఖ
జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, కడప.
టెండర్ నోటీసు

RC No. 26/A2/2024 తేది: 28.08.2024

జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, కడపజిల్లాలోని 13 ICDS Project ల పరిధిలోగల అంగన్వాడి కేంద్రములకు Supplementary Nutrition Programmeలో భాగంగా కందిపప్పును సరఫరా చేయు నిమిత్తమై ప్రాజెక్టు వారీగా సీల్డు టెండర్లు కోరడమైనది. **రూ. 3,000/- (అక్షరాల మూడు వేల రూపాయలు)** బ్యాంకు డ్రాఫ్ట్ రూపములో **ప్రాజెక్ట్ డైరెక్టర్, డి.డబ్ల్యు&సి.డి.ఎ. కడప** పేరిట చెల్లించి టెండర్ డాక్యుమెంట్లు 29.08.2024వతేది 10.00 A.M. నుండి 04.09.2024 3.00 P.M. వరకు కార్యాలయ పనివేళలో పొందవలెను. టెండరును 04.09.2024 తేదిన సాయంత్రము 4.00 గంటలకు సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము నందు కమిటీ సమక్షంలో తెరవబడును. టెండర్ మార్పులు చేయుటకు, వాయిదా వేయుటకు మరియు రద్దు పరచుటకు ఈ క్రింది సంతకము వారికి పూర్తి అధికారము కలదు.

సంయుక్త కలెక్టరు మరియు చైర్మెన్ వారి తరపున, జిల్లా కొనుగోలు కమిటీ, కడప.

గురుకులంలో పతకాల పంట

● ఒక స్వర్ణం, 12 కాంస్య పతకాలు
● రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె, ఆగస్టు 28: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సంజీవపురం గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మన్సూర్ అలీ తెలిపారు. తిరుపతి జిల్లా రేణిగుంట బాలికల హైస్కూల్‌లో ఆగస్టు 25, 26న జరిగిన కుస్తీ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు 16 మంది పాల్గొన్నారు. వీరిలో ఒకరు బంగారు పతకం సాధించగా 12 మంది కాంస్య పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు విజయనందమూర్తి, సురేంద్ర తెలిపారు. అనంతరం గురుకుల పాఠశాల ప్రాంగణలో విజేతలతో ప్రిన్సిపాల్ సమావేశమై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 28: ఎవరి బెదిరింపులకు భయపడకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. బుధవారం ముద్దనూరు రోడ్డులోని రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జమ్మలమడుగులో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సమస్య లేకుండా చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి అభివృద్ధి ఏమాత్రం లేదన్నారు. కౌన్సిలర్ల బెదిరింపులకు తాము భయపడేది లేదని, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నేతలతో ఆయన మాట్లాడారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కార్యకర్తలతో మాట్లాడారు. కూటమి నేతలు గోనా పురుషోత్తంరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి, జనసేన నేతలు నాగార్జున, బాంబ్‌గుండం గౌస్‌మొద్దీన్, పోలీస్ చంద్ర, పాల్గొన్నారు.

భవిష్యత్ మార్గదర్శకులు ఆంగ్ల ఉపాధ్యాయులు

వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: గ్రామీణ విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించగలిగితే ప్రపంచ పోటీలో దీటుగా నిలబడతారని ఆ దిశగా ఆంగ్లభాష ఉపాధ్యాయులు కృషి చేయాలని వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. వైవీయూ ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష నైపుణ్యాలు, ఉన్నత పాఠశాల స్థాయిలో బోధనా విధానాలపై యూనివర్శిటీలో సమన్వయకర్త డాక్టర్ ఆర్‌వీ జయంత్ కాశ్యప్ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆంగ్లభాషా ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు చిన్న చిన్న పదాలతో ప్రారంభించి ఆంగ్లభాష పట్ల ఆసక్తి పెంచాలన్నారు. హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్శిటీ రిజిస్ట్రారు ప్రొఫెసరు నరసింహారావు మాట్లాడుతూ ఆంగ్లభాష ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలు పెంచుకోవాలన్నారు. వైవీయూ రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసరు పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఆంగ్లశాఖ బోర్డ్ ఆఫ్ ఛైర్మన్ అంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలుగును అవమానిస్తున్న అధికార భాషా శాఖ : ఏఐవైఎఫ్



లేఖను చూపిస్తున్న గంగాసురేశ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం అధికార భాషా శాఖ వారిని తెలుగులో సమాచారం కోరితే హిందీ, ఇంగ్లీషులో సమాచారం అడగాలనడం రాజ్యాంగ విరుద్ధ మని, ఇది తెలుగును అవమానించడమేనని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. హోచిమన్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం 8వ షెడ్యూలులో 22 భాషలను అధికారికంగా గుర్తించిందన్నారు. ఈ భాషల్లో భారత ప్రభుత్వ కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకునే హక్కు సమాచార హక్కు చట్టం కల్పించిందన్నారు. సమాచార హ క్కు చట్టం ప్రకారం తెలుగుభాషలో సమాచారం తెలపాలని కోరగా, హిందీ, లేదా ఇంగ్లీషులో అడగాలనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా అభిమానులు స్పందించాలని కోరారు.

సెప్టెంబరులో జిల్లా స్థాయి యువజనోత్సవాలు

కడప (నాగరాజుపేట), ఆగస్టు 28: జిల్లాస్థాయి యువ జనోత్సవాలు స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ తెలిపారు. సెప్టెంబరులో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా పలు అంశాల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తిగల 15 - 29 వయసు గల యువతీ యువకులు సంబంధిత పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలని కోరారు. థిమాటిక్ పోటీలు - సైన్స్ ప్రాజెక్టు థీం, ఇన్నోవేషన్ ఇన్ సైన్స్‌అండ్ టెక్నాలజీ, సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం (గ్రూపు అండ్ సోలో), జానపద గేయం (గ్రూప్ అండ్ సోలో) ప్రత్యక్ష కార్యక్రమం, జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, కథారచన, పెయింటింగ్, డిక్లమేషన్ వ్యవసాయోత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 9949298810, 9849497011 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పందిరి వేస్తుండగా చోటు చేసుకున్న ప్రమాదం ● లైన్లు వేలాడుతూ వుండడమే కారణం



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 28: కొత్తపల్లె పంచాయితీ అమృతనగర్‌లో ఓ ఇంటి వద్ద పందిరి వేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి బాబ్జాన్ (40) మృతిచెందాడు. అమృతనగర్ మదూరురోడ్డులోని మసీదు ఎదురుగా వున్న ఆశావర్కర్ శశికళ ఇంటి గృహప్రవేశానికి ఇంటిపైన పైపుల పందిరి వేస్తున్నారు. దీంతో ఇంటిని ఆనుకుని వున్న విద్యుత్ తీగలు తగలడంతో బాబ్జాన్ ప్రమాదం బారిన పడి తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. గృహప్రవేశం చేయనున్న ఇంటికి ఆనుకుని విద్యుత్ లైన్లు వుండడంతో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు వివరించారు.

బాబ్జాన్ లక్ష్మీవెంకటేశ్వర సప్లయర్స్‌లో పనిచేస్తు న్నాడు. అతనికి తల్లి, భార్య హసీనా బాబాతోషిక్, మహ్మద్ రఫీ ఇద్దరు కొడుకులున్నారు. కూలి చేసుకుంటే తప్ప పూట గడవని కుటుంబం బాబ్జాన్‌దని ఇంటికి పెద్దగా ఆదరువుగా వుండే వ్యక్తి ఇలా అకాల మరణం చెందడం ఆ కుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. అమృతనగర్‌లో చాలా వీధుల్లో విద్యుత్ తీగలు ఇళ్ళను ఆను కుని వుండడం ఇంటిపైన లైన్లు పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇందువల్ల ప్రమాదాలు జరిగినా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహిస్తున్నారు. బాబ్జాన్ కుటుంబానికి విద్యుత్ సంస్థ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి నిందితుల అరెస్టు

● 3050 గ్రాములు గంజాయి స్వాధీనం : అర్బన్ సీఐ లింగప్ప



గంజాయి సహా నిందితులతో సీఐ లింగప్ప, ఎస్ఐలు

జమ్మలమడుగు, ఆగస్టు 28: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నాగలకట్ట వెళ్లే దారిలో 27వ తేదీ సాయంత్రం గంజాయి నిందితులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు ఆయన నిందితుల వివరాలు వెల్లడిస్తూ అంది న సమాచారం మేరకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు సిబ్బంది వెళ్లి దాడి చేశారన్నారు. పట్టుబడిన వారిలో నిందితులు నెల్లూరుజిల్లా ఉదయగిరి వాసి యాదగిరి వంశీకృష్ణ, ప్రొద్దుటూరులోని మత్స్యకాలనీ వాసి గొర్రె స్వర్ణేంద్రకుమార్, బొల్లవరం వీధికి చెందిన గాదెగూడూరు కల్యాణ్, హనుమాన్‌నగర్ వాసి వద్ది సాయిప్రసాద్, చౌడం వెంకటేష్, సానిక కోటవీధి వాసి ఆవుల అరవింద్, ధ్యానసుమంత్ టీకేఆర్ స్కూల్ వీధి, మరో ముగ్గురు బాలురు పట్టుబడినట్లు తెలిపారు. వారి నుంచి 3కిలోల 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు కొంత కాలంగా గంజాయికి బానిసై కిలో రూ.12 వేలకు కొనుగోలు చేసి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లోని కల్యాణ్, స్వర్ణేంద్రకుమార్, సాయిప్రసాద్, వెంకటేష్‌కు విక్రయించేవారన్నారు. గంజాయిని అరవింద్, సుమంత్, మరో ముగ్గురు బాలురు కలిసి రూ.16 వేలకు విక్రయించేవారని విచారణలో తేలినట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని సీఐ తెలిపారు.

బీఎడ్ పరీక్ష కేంద్రాల తనిఖీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి కడప నగరంలో బీఎడ్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆటంకం కలగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరగడానికి జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

1న ఇడుపులపాయకు వైఎస్ షర్మిల రాక

వేంపల్లె, ఆగస్టు 28: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సెప్టెంబరు 1న ఇడుపులపాయ రానున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. 1న హైదరాబాదు నుంచి బయలుదేరి సాయంత్రం 5గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేసి 2న వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ ఘాట్‌లో నివాళులర్పించనున్నారు. 2, 3 తేదీల్లో జిల్లాలోనే అందుబాటులో ఉంటారని 4న షర్మిల తిరిగి వెళతారని తెలిపాయి.

మట్టి విగ్రహాలనే పూజించండి

కడప(కలెక్టరేట్), ఆగస్టు 28: ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని, శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు సహకరించాలని కలెక్టర్ శివశంకర్ పిలుపు నిచ్చారు. జిల్లాలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మత సామరస్యానికి ప్రసిద్ధి అన్నారు. అన్నిమతాల ప్రజల సహకారంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ అదితిసింగ్, డీఆర్వో పాల్గొన్నారు.

ఆక్రమిత భూములు స్వాధీనం




ప్రభుత్వ భూమిలో సాగు చేసిన పంటను తొలగిస్తున్న రెవెన్యూ యంత్రాంగం

సిద్దవటం, ఆగస్టు 28: ప్రభుత్వ భూమిని ఆక్రమించి పసుపు పంట సాగు చేస్తున్న రైతు నుంచి రెవెన్యూ అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లి రెవెన్యూ మందపల్లి గ్రామ పొలంలో సర్వేనంబరు 29/10లో 0.70 ప్రభుత్వ భూమిని బాకరాపేట వాసి ఒకరు ఆక్రమించి పసుపు సాగు చేశాడు. ప్రజల ఫిర్యాదుపై స్పందించిన జేసీ ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడంతో రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం ఎక్స్‌కవేటర్‌తో పూర్తిగా చదును చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వీఆర్వో నాని మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

జమ్మలమడుగు, ఆగస్టు 28: పెన్నానది పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలించే ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను అర్బన్ పోలీసు స్టేషన్ ఆవరణలో పెట్టారు. మొత్తం 8 ఇసుక ట్రాక్టర్లు ఉన్నాయి.



WANTED FEMALE TEACHER
With good Communication Skill in English to work Full time in Kadapa III to IX class Sub: Mathematics, I to V Subject: Hindi, Cell. 90320 35734
AJC-202417

CHANGE OF NAME
I SIDDANA.DEDDAIAH(OLD NAME) D.NO. 7-71E4, CHENNA REDDY PALLI (V) ,MUDDANUR (M), YSR KADAPA DIST, AP, HERE CHANGE MY NAME AS SIDDANA. PEDDAIAH(NEW NAME) S/o S. ROSANNA. HENCEFORTH I MAY BE CALLED AS SIDDANA PEDDAIAH.
AJC-202251

CHANGE OF NAME
I, PHANJAM THANUJ KUMAR (OLD NAME) S/o .P KRISHNA REDDY, R/o.208, MOHAN RESIDENCY, SASTRI NAGAR, KADAPA, YSR Dist, A.P.-516003, INDIA, do hereby Change My Name to PANJAM THANUJ KUMAR (NEW NAME). Hence forth then now I may be called as PANJAM THANUJ KUMAR (NEWNAME).
AJC-000

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః **7382114647**
AJA-198062

ఒకే సం.లో 10th, INTER PASS
ఒకే సం.లో 10th, INTER PASS. DEGREE, P.G. సౌకర్యం కలదు. CONTACT Cell No. : **62815 10785**
Ajc-000

పాసుపోర్టు పోయినది
షేక్ కలేషా S/o షేక్ అబ్దుల్ మజీద్ R/o 15/662 జిన్నారోడ్డు, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, YSR కడప జిల్లా, A.P. పాసుపోర్టు నెం. W 5801785 జారీచేసిన తేది 28.9.2022, పాసుపోర్టు పోయినది. దొరికినవారు తెచ్చివ్వగలరు. **సెల్ : 76710 68785**
Ajc-202302

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. **9440532926**.
AJA-198152

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18k.
Ph: 9160900024, 9640400073 AJH-16372

CHANGE OF NAME
★ I, Mekala Meharoon (Old name) R/o 53/304-7, kagithalapenta Street,Kadapa District, A.P. I Changed my name as SHAIK MEHARUNNISA (New name) AJH-002591

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైభవంగా సీతారాముల కల్యాణం

రామాపురం, ఆగస్టు28: మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెలోని రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పూజలు చేశారు. కల్యాణం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి 'అనగాని'ని కలిసిన మండల టీడీపీ అధ్యక్షుడు


మంత్రి సత్యప్రసాద్‌తో గన్నే సుబ్బనరసయ్య

రాజంపేట టౌన్, ఆగస్టు 28 : రాజంపేట పట్టణ మండల పరిసర ప్రాంతాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసి అనుభవిస్తున్నారంటూ బుధవారం రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య మంగళగిరిలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పేదల పేరుతో తప్పుడు నివేదికలు అందజేసి భూమిని ఆక్రమించారని తెలియజేశారు. అనంతరం శాలువా వేసి పుష్పగుచ్ఛంతో ఆయనను సన్మానించారు.

మంత్రి దృష్టికి దుద్యాల గ్రామ సమస్యలు


దుద్యాల గ్రామ సమస్యలను మంత్రికి వివరిస్తున్న మద్దిరెడ్డి రమేశ్‌రెడ్డి

సంబేపల్లె, ఆగస్టు 28: మండలంలోని దుద్యాల గ్రామ సమస్యలను టీడీపీ నాయకుడు మద్దిరెడ్డి రమేశ్‌రెడ్డి బుధవారం విజయవాడలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపైన ఆయనతో చర్చించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మొక్కలను నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాజంపేట, ఆగస్టు 28: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరే వెంకట సుబ్బయ్య నాయుడు, ఉపాధ్యాయులు రమణ, వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సిస్టం విరాళం

వీరబల్లి, ఆగస్టు 28: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చమర్తివాండ్లపల్లె పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చిన్నచెంద్రాయుడు తన తల్లిదండ్రులు సంటెన్న, తిరుపాలమ్మ జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.21 వేలు విలువ చేసే మైక్ సిస్టంను విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పెరిక బలిజలకు బీసీ-బీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

పీలేరు, ఆగస్టు 28: పెరిక బలిజలకు బీసీ-బీ కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలని జనసేన నాయకులు కామిశెట్టి సుధాకర్, రమణ తహసీల్దారు భీమేశ్వర రావును కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్లుగా పెరిక బలిజ కులస్థులు వివిధ పనులు చేసుకుంటూ పీలేరు పట్టణంలో స్థిరపడ్డారన్నారు. కంప్యూటర్ల వ్యవస్థ రాకముందు వారికి శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం లభించేదని, ఆ తరువాత రెవెన్యూ అధికారులు ఇవ్వడం లేదన్నారు. దీంతో చాలా మంది ఉపాధి అవకాశాలకు దూరం అవుతున్నారన్నారు. ఇకనైనా ఆ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

సిరులు కురిపిస్తున్న డ్రాగన్ ఫ్రూట్

చిట్వేలి, ఆగస్టు 28: బీడు భూముల్లో సైతం బంగారం పండించవచ్చు అని నిరూపిస్తున్నారు చిట్వేలి మండల రైతులు. సంప్రదాయ పంటలతో ఆశించిన ఆదాయం రాకపోవడంతో అన్నదాత ఆలోచన ఉద్యాన పంటలవైపు దృష్టి సారిస్తున్నారు. అందులో విదేశీ పంటను కూడా సాగుచేస్తూ వినూత్న పద్ధతులు మెళవకులు పాటిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. కరోనా సమయంలో మొదలైన ఆలోచన మండలంలో నూతన పంటవైపు అడుగులు వేసింది. ఔషధ గుణాలు మెండుగా కలిగిన డ్రాగన్ ఫ్రూట్ సాగుపై దృష్టిపెట్టి లాభాలు గడిస్తున్నారు. మండల పరిధిలోని రాజుకుంటకు చెందిన నానబాల మనోహర్ 2021 జనవరిలో అర ఎకరా పొలంలో 250 స్తంభాలు ఏర్పాటు చేసి, వెయ్యి మొక్కలు నాటి సాగు మొదలు పెట్టారు. నాటి నుంచి నేటి వరకు లాభాలు గడిస్తూ, సాగు విస్తీర్ణం మరింత విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి రసాయన ఎరువులతో కాకుండా కుటుంబ సభ్యులతో కలిసి సొంతంగా జీవామృతం తయారు చేసి ఆర్గానిక్ పద్ధతిలో పంట సాగు చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు

అరటి, బొప్పాయి, పూలతోటల సాగులో అధిక పెట్టుబడులు పెట్టినా నష్టపోతున్న రైతులు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా లాభాలు వచ్చే డ్రాగన్ ఫ్రూట్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. మండలంలో ప్రస్తుతం 10 ఎకరాల వరకు రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి ఏడు జూలై నుంచి డిసెంబరు వరకు దిగుబడి వస్తుంది. రైతులే ఒక కిలో 150కి మార్కెట్లో అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు. .


విరగకాసిన డ్రాగన్ పండ్లు


రైతు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోట

కుటుంబ సభ్యుల సహకారంతో డ్రాగన్‌ఫ్రూట్ సాగు



కరోనా సమయంలో తన కుమారుడు సురేంద్రకు వచ్చిన ఆలోచనతో డ్రాగన్ ఫ్రూట్ సాగు మొదలు పెట్టాం. పెద్దకుమారులు రాజేష్, రవీంద్ర సహకారంతో పంటను విస్తరింపజేశాం. మార్కెట్‌లో సొంతంగా విక్రయిస్తున్నాం. 2 లక్షల పెట్టుబడితో మొదలు పెట్టాం. ప్రభుత్వం లక్ష రూపాయలు సబ్సిడీ అందించింది. ప్రతి యేడు ఆశించిన ఆదాయం వస్తుంది. ప్రతికూల వాతావరణంతో నేడు కాపు కాస్త తగ్గింది. సాగు మరింత విస్తరింపజేయాలని ప్రయత్నాలు మొదలు పెట్టాం.

- నానబాల మనోహర్, రైతు, రాజుకుంట

ఫ్రీ హోల్డ్ భూములను వీలైనంత త్వరగా గుర్తించాలి

నందలూరు, ఆగస్టు 28 : ఫ్రీ హోల్డ్ భూములను వీలైనంత త్వరగా గుర్తించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఫ్రీహోల్డ్ భూములపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అమర్‌నాథ్, ఆర్ఐ సుశీల్, మండల సర్వేయర్ ఓబయ్య, వీఆర్వోలు, వీఆర్‌పీలు పాల్గొన్నారు.

చిట్వేలి : క్షేత్రస్థాయిలో నివేదికలు పరిశీలించి నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం చిట్వేలి తహసీల్దారు కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీకేటీ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. కాస్ట్ ఫ్రీ వెరిఫికేషన్ క్షుణ్ణంగా పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్దారు సుమని, ఆర్ఐ శేషంరాజు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఫ్రీ హోల్డ్ భూములపై సిబ్బందికి సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్

కనులపండువగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

పెనగలూరు, ఆగస్టు 28 : మండలంలోని కొండూరు గ్రామంలో రూ. 53 లక్షల దేవదాయశాఖ నిధులతో పునరుద్ధరించిన చెన్నకేశవస్వామి దేవాలయంలో గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కుంభాభిషేకం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం దేవాలయ చైర్మన్ కొండూరు విజయ్‌రెడ్డి, భూదేవి దంపతుల ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి, చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు అజయ్‌రెడ్డి, విజయ్‌రెడ్డి పట్టు కండువాలు కప్పి శ్రీవారి చిత్రపటాలను బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రాజారెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, పెనగలూరు ఎంపీపీ కోడూరు సౌందర్య, చిట్వేలి ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, ఆకేపాటి అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీఎల్ నరసింహారెడ్డి, వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త పంచేటి ప్రతాప్‌రెడ్డి, నారాయణనెల్లూరు సర్పంచ్ కేతా చక్రపాణి పాల్గొన్నారు.


శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశస్వామి కల్యాణోత్సవంలో కొండూరు విజయ్‌రెడ్డి, భూదేవి దంపతులు

దోమలు పుట్టకుండా, కుట్టకుండా చర్యలు తీసుకోవాలి

రాయచోటిటౌన్, ఆగస్టు 28: దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. శిబ్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని అనుంపల్లెలో బుధవారం లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా జ్వరాలు, దోమల ద్వారా వ్యాపిస్తాయని, దోమలు వృద్ధి నివారించడానికి ప్రతి ఫ్రైడేని డ్రైడేగా పాటించాలన్నారు. వర్షపునీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని, మంచినీటి డ్రమ్ములు, పాత్రలపైన మూతలు పెట్టుకోవాలని తెలిపారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కుండల్లో వర్షపు నీరు తొలగించాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న రోళ్లను మట్టితో నింపివేయాలని, తొట్లు, కాగులు, కుండలు బోర్లించాలని తెలిపారు. దోమలు నాశనం చేయడానికి సామూహికంగా వేపాకు పొగ పెట్టాలన్నారు. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ఇంటి చుట్టూ మురుగునీరు నిలబడకుండా చూసుకోవాలని కోరారు.


శిబ్యాలలో నీటి తొట్లను శుభ్రం చేసి దోమల లార్వాను నాశనం చేస్తున్న వైద్య సిబ్బంది

శివాలయ కమిటీని రద్దు చేయాలని వినతి

సుండుపల్లె, ఆగసు 28: మండల కేంద్రంలోని శివాలయ కమిటీని రద్దు చేయాలని దేవదాయ శాఖ జిల్లా అధికారులకు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం మహదేవ, గౌరవాధ్యక్షుడు వీరనాగయ్య తెలిపారు. మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఆలయంలో వివక్ష చూపుతున్నారని వారు పేర్కొన్నారు. నిత్యం పూజలు జరగాల్సిన శివాలయం ఆవరణలో గడ్డిని పెంచుతూ తమ స్వార్థానికి వినియోగించుకుంటున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి దేవాలయ అభివృద్ధికి పనిచేసే వారిని నియమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు జయరామయ్య, గొల్లపల్లి నాగలేసు, డీలర్ రమణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఆక్రమణల పరిశీలనకు వెళ్లిన సిబ్బంది అడ్డగింత

నందలూరు, ఆగస్టు 28: ఆక్రమణకు గురైన తమ స్థలాన్ని ఇప్పించాలని సంఘసేవకుడు వేపగుంట సామ్రాజ్ బుధవారం రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తమకు చెందిన మూడు సెంట్ల స్థలాన్ని విశ్రాంత ఉద్యోగి జంబు రవీంద్రబాబు ఆక్రమించుకుని భవనం నిర్మించుకున్నాడని సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకోగా స్పందించిన సబ్‌కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని నందలూరు తహసీల్దారుకు సిఫారసు చేశారు. దీంతో ఆయన మండల సర్వేయర్, నాగిరెడ్డిపల్లె వీఆర్వో, సంబంధిత అధికారులను వివాదాస్పద స్థలం వద్దకు పంపించగా, వారు కొలతలు తీసుకోకుండా జంబు రవీంద్రబాబు, ఆయన భార్య శశికళ అడ్డుకోవడంతో పాటు, ఇష్టం వచ్చినట్లు దూషించారని బాధితులు సామ్రాజ్, కుంచపు లక్ష్మీనరసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.


రెవెన్యూ సిబ్బందిని అడ్డుకుంటున్న ఆక్రమణదారులు



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

చిన్నమండెం, ఆగస్టు28: మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో వండాడి, చాకిబండ రహదారి పక్కన బ్రిడ్జి ఆనుకుని మాండవ్యనదిలో బుధ వారం సాయంత్రం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకొని పోలీసులకు, సెబ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఈబీ అధికారులు ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని చిన్నమండెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్ఐ సుధాకర్‌ను వివరణ కోరగా సెబ్ అధికారులు, ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామన్నారు.

గాలివీడు: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని పాపాఘ్ని నది నుంచి గాలివీడుకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను దానంరెడ్డిగారిపల్లె వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్‌తో పాటు డ్రైవరు, ఓనర్‌పైన కూడా కేసు నమోదు చేశామన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

తహసీల్దార్ పుల్లారెడ్డికి సన్మానం

రాయచోటిటౌన్, ఆగస్టు 28: రాయచోటి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పుల్లారెడ్డిని అన్నమయ్య జిల్లా ఏపీసీఆర్ఎఫ్ సభ్యులు బుధవారం శాలువాతో సన్మా నించారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్ఎఫ్ రాయల సీమ ప్రెసిడెంట్ మేకల దర్బార్‌బాషా, జిల్లా సభ్యులు రవిశంకర్, శంకర్‌రెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య


రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

సుండుపల్లి, ఆగస్టు 28: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. బుధవారం సుండుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీ, ఓపీ, రోగుల గది, హాజరు నమోదులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సమస్యలు లేకుండా చూడాలన్నారు. డయేరియా, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అనేక వ్యాధులు వస్తాయని, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు.

'రాజ గోపుర ప్రతిష్ఠ' మంత్రులకు ఆహ్వానం


విజయవాడలో మంత్రులకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గాలివీడు టీడీపీ నాయకులు

గాలివీడు, ఆగస్టు 28: గోరాన్ చెరువు పంచాయతీ గేటు సమీపంలోని రామాలయ రాజ గోపురం ప్రతిష్ఠ కార్యక్రమానికి రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను ఆహ్వానించినట్లు మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కేదం లక్ష్మయ్య, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం విజయవాడలోని మంత్రుల క్యాంపు కార్యాలయా నికి వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేశారు. సెప్టెంబరు నాలుగు, ఐదు, ఆరు తేదీల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మంత్రులను ఆహ్వానించామన్నారు. ఐదవ తేదీన మంత్రులు రానున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నయ్య, ఇంద్రసేనారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేద్దాం


విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రామాపురం, ఆగస్టు 28: జనతా పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతిరాజు పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి మండలంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నామని మండల కన్వీనర్ గంపా సుబ్బరాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని రామాపురంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ భారత దేశాన్ని అగ్రదేశాల సరసన నిలపడానికి నరేంద్రమోడీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటశివ, చంద్రశేఖర్, మహేశ్, వెంకట్రమణ, రాంబాబు, రాయచోటి రూరల్ నాయకులు నందగోపాల్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

రాతి చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు


రాతి చెరువు అక్రమణలపై తహసీల్దారుకు ఫిర్యాదుచేస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

సుండుపల్లి, ఆగస్టు 28: సుండుపల్లి మండల కేంద్రానికి సమీపంలోని రాతి చెరువు అక్రమణలకు గురవుతోందని టీడీపీ నాయకులు, స్థానిక రైతులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. సర్వే నెం: 1644 లో 67.80 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో రాతి చెరువుగా నమోదై ఉంది. ఈ చెరువు పోచంవాండ్లపల్లె, ఎగువ మాలపల్లె, ఈడిగ పల్లె, కుమ్మరపల్లె, చాకలపల్లె, కటవకిందపల్లెతో పాటు మరికొన్ని గ్రామాల రైతులకు ఈ చెరువు జీవనాధారంగా మారింది. కొంత మంది చెరువును అక్రమించి, బోర్లు వేసి మామిడి తోటలు సాగుచేస్తున్నారు. ఈ అక్రమణల నుంచి చెరువును కాపాడాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షుడు యర్రంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బెల్లాల రమణ, ఎరికాల కళ్యాణ్, ఓబులేసు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి


అక్రమ నిర్మాణాలపై అరా తీస్తున్న వీఆర్‌ఓ, జనసేన నాయకులు

సుండుపల్లి, ఆగస్టు 28:మండలంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో భైరవగుట్టను ఆక్రమించినిర్మాణాలు చేశారని, అక్రమణల నుండి భైరవ గుట్టను కాపాడాలన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాల వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు లక్ష్మీనారాయణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కరించాలి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

సిద్దవటం, ఆగస్టు 28: మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మాధవరం ఎంపీటీసీ సభ్యులు శివయ్య, లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. సిద్దవటం మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ, ఎంపీడీవో జవహర్ బాబు, తహసీల్దారు మురాషావలి, ఏవో రమేష్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


సీపీఐ కార్యదర్శిరామకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న బీకేఎంయూ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 28: భూ ఆక్రమణలు, పేదలు సాగు చేసుకుంటున్న భూములు, ఇండ్లస్థలాలకు పట్టాలు, పాస్ బుక్‌ల మంజూరు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు, కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించినట్లు బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. బుధవారం విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర సదస్సులో ఈ మేరకు విన్నవించడంతో కోడూరు నియోజకవర్గంలో భూ ఆక్రమణలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ నిర్ముచి

పెనగలూరు, ఆగస్టు 28: అంగన్వాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో వ్యాధులను వ్యాప్తి చెందకుండా అరికట్టేం దుకు సూచనలు చేయాలని పెనగలూరు పీహెచ్‌సీ డాక్టర్ నిర్ముచి తెలిపారు. గురువారం నారాయణనెల్లూరు, కోమంతరాజ పురం, నల్లపురెడ్డిపల్లె గ్రామాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. ప్రస్తుతం చిన్న పెద్ద తేడా లేకుండా వ్యాధులు దాడి చేస్తున్నాయని తెలిపారు. జలుబు, దగ్గు నుంచి ప్రారంభమై జ్వరాలు, వాంతులు, విరేచనాల దాకా వెళుతున్నాయని తెలి పారు. అన్నింటికీ ముందు జాగ్రత్తలే ప్రధానమని ఆమె వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వండి పెడుతున్న ఆహారాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీహరి సన్నిధిలో ఉట్లోత్సవం


ఆలయం ముందు ఉట్టి కొడుతున్న భక్తులు


మలయప్పస్వామి, కృష్ణస్వామి ఊరేగింపు

తిరుమల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో బుధవారం ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా మలయప్పస్వామి, కృష్ణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెద్దజీయర్ మఠానికి తీసుకొచ్చి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.పెద్దజీయర్ మఠం, హథీరాంజీమఠం హారతి పొంది తిరిగి ఆలయం వద్దకు వేంచేశాక శ్రీవారి ఆలయం ముందు గొల్లమండపం పక్కనే ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. స్థానిక యువతతో పాటు పలువురు భక్తులు కూడా పాల్గొన్నారు.టీటీడీ జీయర్‌స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో శ్రీవారి అంగప్రదక్షిణ టోకెన్లు

రూ.500 డిపాజిట్ తప్పనిసరి : టీటీడీ

తిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరవాసులతో పాటు తిరుమలవాసులకు ప్రతి శనివారం కేటాయిస్తున్న 250 శ్రీవారి ఆలయ అంగప్రదక్షిణ టోకెన్లను ఇకపై లక్కీడిప్ ద్వారా కేటాయించనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో రోజూ 750 టోకెన్లను తిరుమలలోనే ఆఫ్‌లైన్ ద్వారా కేటాయించేవారు. అయితే క్యూలైన్లలో భక్తుల నిరీక్షణ సమయాన్ని మరింత తగ్గించే ఉద్దేశంతో ఈ టోకెన్లను కూడా ఆన్‌లైన్ ద్వారానే కేటాయించేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే కొందరు స్థానికులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన నేపథ్యంలో ప్రతి శనివారం 250 టోకెన్లను స్థానిక ఎమ్మెల్యేకు బదిలీ చేస్తూ వచ్చారు. ఆన్‌లైన్‌లో మిగతా రోజులకు 750 టోకెన్లు కేటాయిస్తే శనివారం 500 టోకెన్లు మాత్రమే కేటాయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి శనివారం ఇచ్చే ఈ 250 టోకెన్లను కూడా ఆన్‌లైన్‌లోనే పెట్టాలని టీటీడీ తాత్కాలికంగా నిర్ణయం తీసుకుని గత శనివారానికి సంబంధించిన టోకెన్లను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ విషయంలో టీటీడీ శాశ్వత నిర్ణయం తీసుకుంది. అంగప్రదక్షిణ టోకెన్లు కావాల్సిన భక్తులు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వీరికి సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ ద్వారా టోకెన్లు కేటాయిస్తారు. డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులు వారి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా ఆ సమాచారం ఉంచుతారు. డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు ఆన్‌లైన్‌లోనే రూ.500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. లక్కీడిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అంగప్రదక్షిణ టోకెన్లు పొందాల్సి ఉంటుంది. వీరిని శనివారం వేకువజామున అంగప్రదక్షిణకు అనుమతిస్తారు. అనంతరం భక్తులు చెల్లించిన రూ.500 డిపాజిట్‌ను తిరిగి వారి ఖాతాల్లోకే టీటీడీ జమచేస్తుంది. తిరుపతి నియోజకవర్గానికి చెందని భక్తులు లక్కీడిప్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు పొందితే డిపాజిట్ తిరిగి చెల్లించమని, అంగప్రదక్షిణకు అనుమతించబోమని టీటీడీ స్పష్టం చేసింది.

స్విమ్స్‌లో రోగి అదృశ్యం

అధికారులు పట్టించుకోకపోవడంతో వెస్ట్ పోలీసులకు కుమారుడి ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28 : ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న రోగుల భద్రత పూర్తిగా ఆ ఆస్పత్రి అధికారులదే. అయితే ఆరోగ్యం క్షీణించి ఎంఐసీయూలో చికిత్స పొందుతున్న రోగి అకస్మాత్తుగా కనిపించకుండా పోయినా తమకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిస్థితి స్విమ్స్‌లో నెలకొంది. స్విమ్స్‌లో డాక్టర్లకే రక్షణ లేదంటూ వారం రోజులుగా జూనియర్ డాక్టర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం మరువకముందే చికిత్స పొందుతున్న రోగి అదృశ్యం అవడం స్విమ్స్‌లో సెక్యూరిటీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. బాధితుల కథనం మేరకు...అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంగళవారం స్విమ్స్‌కు తీసుకువచ్చారు.ఓపీలోని వైద్యులు పరీక్షించి ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని, చికిత్స అందించి ఆ నీటిని తొలగించాలని చెప్పారు. ఇందుకు తక్షణమే అడ్మిట్ కావాల్సి ఉంటుందని డాక్టర్లు చెప్పడంతో సీతారామప్పను ఆయన కుమారుడు విశ్వనాథ్ తన వద్ద ఉన్న రూ. 5 వేలు చెల్లించి అడ్మిట్ చేశారు.శ్రీపద్మావతి భవనంలోని నాలుగో అంతస్తులో ఉన్న ఎంఐసీయూలో అడ్మిషన్‌లో ఉన్న సీతారామప్పను వైద్యులు మంగళవారం రాత్రి మరోసారి పరీక్షించి బుధవారం చికిత్స చేస్తామని, అప్పటి వరకు వాడమంటూ కొన్ని మందులు రాసిచ్చారు.ఆ మందులు వేసుకొని పడుకున్న సీతారామప్ప మంగళవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం ఒకసారి లేవడంతో విశ్వనాథ్ తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చి పడుకోబెట్టాడు.విశ్వనాథ్ కూడా ఆ పక్కనే నిద్రకు ఉపక్రమించాడు. తిరిగి రెండు గంటల సమయంలో విశ్వనాథ్ లేచి చూడగా పడకపై సీతారామప్ప కనిపించలేదు. దీంతో కంగారు పడిన విశ్వనాథ్ ఆ భవనం అంతా వెతికినా తండ్రి కనిపించకపోవడంతో సెక్యూరిటీ సిబ్బందికి విషయం చెప్పాడు.వారే మాత్రం పట్టించుకోకుండా ఇక్కడే ఎక్కడో ఉంటాడులే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తెల్లవారుజాము వరకు వెతుకుతూనే ఉన్నాడు. బుధవారం మరోసారి స్విమ్స్ ఆవరణ మొత్తం వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు విషయాన్ని స్విమ్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో ఉదయం 10 గంటల సమయంలో ఎంఐసీయూ వార్డుకు వచ్చిన స్విమ్స్ అధికారులు విచారణ చేపట్టారు. రోగిని భద్రంగా చూసుకోకుండా ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని విశ్వనాథ్‌నే మందలించారు.మీరు చెల్లించాల్సిన నగదు బ్యాలెన్స్ చెల్లించాలని ఒత్తిడి చేశారు. తన తండ్రి ఆచూకీ తెలిశాకే నగదు పూర్తిగా చెల్లిస్తానని విశ్వనాథ్ అధికారులకు తెగేసి చెప్పాడు.ఎంఐసీయూలో ఉన్న తన తండ్రి బయటకు వచ్చే అవకాశం లేదని కనీసం ఆయన మెట్లు కూడా దిగలేడని ఎంత చెప్పినా వారు వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేసేదేమీలేక బుధవారం మధ్యాహ్నం వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి ఆరోగ్య పరిస్థితి మాత్రమే బాగాలేదని, మానసిక పరిస్థితి బాగానే ఉందని ఇలా ఆయన చెప్పకుండా ఒక్కడే ఎక్కడకూ వెళ్లడని పేర్కొన్నాడు.అయిన వారిని వైద్యం కోసం తీసుకువచ్చే సహాయకులను కనీసం వార్డుల్లోకి కాదు కదా భవనంలోకి కూడా అనుమతించకుండా స్విమ్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దీంతో భవనం బయటే రాత్రిళ్లు సహాయకులు ఇబ్బంది పడుతూ ఉండాల్సి వస్తోందని తెలిపాడు.


సీతారామప్ప

బండరాయితో కొట్టి చంపేశారు



చిత్తూరు, ఆగస్టు 28: బండరాయితో మోది గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన ఘటన చిత్తూరులో బుధవారం చోటుచేసుకుంది. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన ప్రకారం.. సంతపేట ఇందిరానగర్ నుంచి వీరభద్రకాలనీకి వెళ్లే మట్టి రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి(27)పై కొందరు బండరాయితో మోదడంతో మృతిచెందాడు. మృతుడి వివరాలు, చంపడానికి కారణాలు తెలియాల్సి ఉంది. వివరాలు తెలిసినవారు 9491074517కు తెలియజేయాలని కోరారు.

ఎనిమిది మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. కార్వేటినగరంలో 7.6, నింద్ర 6.4, కుప్పం 6.0, వెదురుకుప్పం 5.2, నగరి 5.2, పులిచెర్ల 2.0, రొంపిచెర్ల 1.4, పెనుమూరులో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28: గంజాయి రవాణా కేసులో ముగ్గురు నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు తిరుపతి ఈస్ట్ డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. ఐదుగురు స్నేహితులు ఓ ముఠాగా ఏర్పడి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెట్టామన్నారు. విక్రయించడానికి తీసుకెళుతున్న దాదాపు రూ.60 వేల విలువైన నాలుగు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. తిరుపతికి చెందిన సాయిభాను, భరత్‌కుమార్‌రెడ్డిని, ఎస్ఆర్ పురం మండలం కొండేపల్లికి చెందిన ఈశ్వర రెడ్డిని అరెస్టు చేశామన్నారు.

కుప్పం రెస్కోలో ఇక నాణ్యమైన సేవలు!

కొత్తగా 12 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రణాళిక ● మొండి బకాయిదారులకు నోటీసులు


కుప్పంలోని రెస్కో ప్రధాన కార్యాలయం

కుప్పం, ఆగస్టు 28: కుప్పం రెస్కోలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణలు సాగడమే కాదు.. సంస్థ సామర్థ్యం పెంపునకు సమాంతరంగా కసరత్తు నడుస్తోంది. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు వి.కోట మండలంలోని 8 పంచాయతీలు కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) పరిధిలోకి వస్తాయి. ఇప్పుడు 154 ఫీడర్లు ఉన్నాయి. ప్రస్తుత వినియోగానికి ఇవి చాలక.. 50 శాతం ఓవర్ లోడ్‌తో పనిచేస్తున్నాయి. అందుకే ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతూ, ఇతర సమస్యలతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గత అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోగా, అవినీతి, అక్రమాలతో సంస్థను నిర్వీర్యం చేసి విడిచిపెట్టింది. టీడీపీ అధికారంలోకి రాగానే రెస్కోలో అవినీతిపై విచారణతో పాటు ప్రధాన సమస్యపైనా దృష్టి పెట్టింది. రెస్కో సామర్థ్యాన్ని పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో తిరుపతి ఎస్ఈ (ఆపరేషన్స్) సురేంద్రనాయుడు జూలై 20న పర్యటించి సమస్యలపై అధ్యయనం చేశారు. సరికొత్తగా 12 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. దీనికి ప్రభుత్వం ఆమోదించింది. ప్రస్తుతం స్థలాలకోసం అన్వేషణ జరుగుతోంది. మరోవైపు హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్)లనే చిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసే కసరత్తు కూడా ప్రారంభించారు. ఈ ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కింద నాలుగైదు వ్యవసాయ సర్వీసులు మాత్రమే ఉంటాయి. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైతే కేవలం ఆ నలుగురైదుగురు రైతులకు మాత్రమే సమస్య పరిమితమవుతుంది. ఇప్పటికే వి.కోట, శాంతిపురం మండలాల్లో చాలాచోట్ల వీటిని ఏర్పాటు చేశారు. కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు రెస్కోలో పేరుకు పోయిన రూ.125 కోట్ల మొండి బకాయిలకు సంబంధించి నోటీసులూ జారీ చేవారు. ఒకటీ అరా బకాయిలు వసూలు అవుతున్నాయి. ఈ ప్రక్రియకు కూడా రాజకీయ సిఫార్సులు అడ్డు వస్తున్నట్లు తెలిసింది. వీటిని దాటుకుని వసూలు చేయగలిగితేనే రెస్కో ఆర్థిక పరిస్థితి నిలకడగా ఉంటుంది.

ఎస్పీడీసీఎల్‌కు అనుసంధానం



సీఎం చంద్రబాబు ఆదేశాలతో సంస్థలో పలు అభివృద్ధి చర్యలు నడుస్తున్నాయి. అలాగే రెస్కోను సాంకేతికంగా ఎస్పీడీసీఎల్‌కు అనుసంధానం చేయడానికి కసరత్తు నడుస్తోంది. ఆన్‌లైన్ సేవలన్నీ, ఎస్పీడీసీఎల్ ద్వారా నడపగలిగితే వినియోగదారులకు బిల్లింగ్ వంటి వ్యవహారల్లో నాణ్యమైన, కచ్చితమైన సేవలు అందుతాయి. ఇందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ రూపకల్పన ప్రయత్నాలు సాగుతున్నాయి.

- సోమశేఖర్, రెస్కో ఎండీ

సామాజిక పనుల్లో రూ.24.88 లక్షల అక్రమాలు



పలమనేరు, ఆగస్టు28 : మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పనులపై బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. 10 పంచాయితీల్లో 639 పనులు చేశారు. రూ. 4.44 కోట్ల విలువ చేసే పనులకు సంబంధించి సమగ్ర తనిఖీలు చేశారు. రూ.24.88 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు మండల ఏపీఓ, టీఏ, జేఈ, ఎఫ్.ఎఫ్‌లను బాధ్యులుగా నిర్ధారించారు. శ్రీనివాసులురెడ్డి, మురళి అనే టీఏ సిబ్బందికి నుంచి రూ. 15వేల చొప్పున రికవరి చేయాలని నిర్ణయించారు. అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అధికారులు తెలిపారు. తనిఖీలో విజిలెన్స్ అధికారిభవాని, డీఆర్‌డీఏ ఏపీడీ రవి, ఏపీఓ రవికుమార్, ఎంపీడీఓ రాజేష్ పాల్గొన్నారు.

వాస్తు దోషంతో వందేళ్ల వృక్షానికి మంగళం?!


సదుం పోలీసు స్టేషన్ వద్దనున్న వృక్షం

సదుం, ఆగస్టు 28: పోలీసుల సెంటిమెంటు కారణంగా ఏళ్లనాటి ఈ చెట్టు కనుమరుగవుతుందేమోనని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సదుంలోని పోలీసు స్టేషన్ ప్రహరీ ఈశాన్యం భాగంలో చాన్నాళ్లుగా ఓ వటవృక్షం ఉంది. దీనివల్ల స్టేషన్‌కు వాస్తు దోషం ఉందనే అపోహతో నేలకూల్చడానికి ఇటీవల పోలీసు సిబ్బంది సిద్ధమయ్యారని తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బాధపడుతున్నారు. ఆ వృక్షంతో తమ అనుబంధం తెగిపోతుందంటున్నారు. వాస్తు రీత్యా ఈశాన్య భాగం బరువు ఉండకూడదని కొందరు భావిస్తారు. చిన్నపాటి మార్పుతో ఈ దోష్నాన్ని తొలగించుకునే అవకాశం ఉందంటున్నారు. కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు తరచూ ఈ చెట్టుకు పూజలు చేస్తుంటారు. వృక్షం స్థలాన్ని స్టేషన్ వెడల్పునకు నేరుగా వదిలితే ప్రహరీకి ఈశాన్యంలో మర్రిచెట్టు ఉండదు. బయట ప్రదేశంలో మిగిలిపోతుంది. స్టేషన్ ముందు ఐదు అడుగుల జాగాలో చిన్నపాటి పూలమొక్కలు పెంచుకోవచ్చునని లేదా స్టేషన్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు చెట్టు నీడలో పార్కింగ్‌కు ఉపయోగించుకోవచ్చునని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

31న జాబ్‌మేళా

చిత్తూరు రూరల్, ఆగస్టు 28: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టయోటా, హోండా కంపెనీలలో పలు పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలు లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు పూర్తి బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.20 వేల వరకు వేతనాలు అందిస్తారని వెల్లడించారు. ఇతర వివరాలకు 9704731410ను సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు పెంపొందించుకోవాలి

ఎకనమిక్స్ జాతీయ సదస్సులో వక్తల మనోభావం


సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీలంక ప్రతినిధి ప్రొఫెసర్ అమృతలింగం తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఆగస్టు 28: అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకోవడం ద్వారా ఆయా దేశాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని శ్రీలంకలోని కొలంబో యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.అమృతలింగం అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ ద సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఛాలెంజెస్ అంశంపై ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలు సంయుక్తంగా బుధవారం జాతీయ సదస్సు చేపట్టాయి. పద్మావతి వర్సిటీ సావేరి హాల్లో చేపట్టిన ప్రారంభ సభలో ప్రొఫెసర్ అమృతలింగం కీలకోపన్యాసం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకునే సందర్భంలో శ్రీలంక విఫలమైందన్నారు. కరోనా సమయంలో చైనా సహకారంతో ముందుకు వెళ్లాల్సి ఉండేదని తెలిపారు. భారతదేశంతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను పెంచుకోవడం ద్వారా శ్రీలంకకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల ద్వారానే ఒక దేశపు జాతీయ ఆదాయంలో స్థిరమైన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన లక్ష్య సాధనకు ప్రతి దేశం సహకారాన్ని అందించాలని కోరారు. ఆర్థిక శాస్త్ర విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని సూచించారు. పద్మావతి వర్సిటీ డీన్ కిరణ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. కరోనా, యుద్ధ సమయంలో వివిధ రాష్ట్రాలు, దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో శాంతి, సామరస్యం సాధించాలంటే దేశాల మధ్య సత్సంబంధాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలసాగు ద్వారా స్థూల జాతీయ ఉత్పత్తి పెంపునకు కృషి

వ్యవసాయశాఖ ప్రత్యేకప్రధానకార్యదర్శి రాజశేఖర్



తిరుపతి రూరల్, ఆగస్టు 28: వ్యవసాయరంగంలో ప్రధానపంటల సాగు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువజోడింపు, విదేశాలకు ఎగుమతుల ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు కృషి చేయాలని వ్యవసాయశాఖ రాష్ట్ర ప్రత్యేక ప్రధానకార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో వికసిత్ ఆంధ్రా-2047 అనే అంశంపై అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు, ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ శాస్త్రవేత్తలకు బుధవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి, ప్రధానపంటలలో అధిక దిగుబడి సాధించేందుకు చేపట్టాల్సిన మెరుగైన నూతన విధానాలు, మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ప్రధాన పంటలసాగు వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. పంటల ఉత్పాదకత పెంపు, రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, విజన్ ఆంధ్రా-2047లో నిర్ణయించిన లక్ష్యాలను చేరుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానపంటల సాగు, విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. వ్యవసాయ సాగులో రైతుల ఆదాయం పెంపుతోపాటుగా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లాల వరకు చేపట్టాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ వర్సిటీ విస్తరణ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ప్రమీలారాణి మాట్లాడుతూ వర్సిటీలో పరిశోధన, విస్తరణ విభాగాల ద్వారా లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త పరిశోధనలు చేపట్టాలని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ మెరుగైన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన పంటల సాగుని వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ కె.నిర్మల్ రవికుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల ట్రేడింగ్, విదేశాలకు ఎగుమతి ద్వారా స్థూల దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. పంట కోతల అనంతరం చేపట్టాల్సిన నూతన సాంకేతికత, ప్రాసెసింగ్, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపువంటి అంశాలను విశదీకరించారు. కాగా తమ తమ జిల్లాలో ఉన్న పంటల సరళిని 26 జిల్లాలకు చెందిన వ్యవసాయాధికారులు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి జి.ధనుంజయరెడ్డి, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
Rtd Employees /VRS మరియు Qualified సీనియర్ సిటిజన్స్‌కి సువర్ణ అవకాశం తిరిగి మీ పూర్వ వైభవాన్ని పునర్నిర్మించడం కొరకు సంప్ర. KUBER RESIDENCY, TPT. Cell: 95058 50438, +91 94407 93155
AJT-4235

CHANGE OF NAME
I, MOHAMMED HASEENA, W/o. IRFAN KHAN (Old Name), R/of D.No. 7-189, Masjid Street, Nakka Banda, Islam Nagar, Punganur T&M, Chittoor Dist 517247, AP. Have changed my name as SHAIK HASEENA, D/o.SHAIK SAMIULLA (New Name)
AJT -4234

CHANGE OF NAME
I, SHAIK MOHAMAD ALI, S/o. BASHASAB SAMIULLA (Old Name), R/of D.No.3-96/27-2, NTR Colony, N S Peta, Punganur T&M, Chittoor Dist-517247, AP. Have changed my name as SHAIK MOHAMMAD ALI, S/o. SHAIK SAMIULLA (New Name)
AJT -4233

CHANGE OF NAME
I, PAPPU SURESH KUMAR (Old Name) D.No.11-214-B, Basinikonda Village MADANAPALLE Post and Mandal,ANNAMAYYA District. AP, Shall Henceforth be Known as: P. SURESH KUMAR REDDY (New Name).Sd/ P. Suresh Kumar Reddy.
AJT -1093

CHANGE OF SURNAME
I, MALLAVARAM SRAVANTHI W/O KANDATI PRAVEEN Residing at 19-3-1-A2/C3, POSTAL COLONY, RENIGUNTA ROAD, TIRUPATI - 517501, TIRUPATI (Dist), A.P. Hence I state That My Name has been Changed from KANDATI SRAVANTHI (My Old SurName) TO MALLAVARAM SRAVANTHI (My New SurName)
AJT -2017

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, పిక్సింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 196062

CHANGE OF NAME
I, SWARNA W/o Army No: JC352932A, Sub: C.ACHYUTHA REDDY, Unit CME: Pune, 411031 declared that my name is wrongly recorded Swarna as my husband Service Record, but my correct name is C.SWARNA REDDY
AJT -187295

PASSPORT LOST
I,SHAIK ROSHAN BASHA, S/o Late Sulaman Shaik, resident of Door No.15-1685, Lalugarden,Chittoor, AP hereby inform that I have misplaced my Indian Passport bearing No.M 403681.If any body found said passport Please handover to me at above address. Please Contact : 8074976776
AJT -4480

CHANGE OF NAME
I, MUMMADIREDDY LAKSHMIREDDY GARI SREEKANTH REDDY S/o MUMMADILACHANNA-GARI CHANDRASEKHAR REDDY, Residing at 6-1-243/A/201, Varadaraja Nagar, Opposite Old POST OFFICE, K T Road, TIRUPATI - 517501, TIRUPATI (Dist), A.P. Hence I state that my name has been Changed from MUMMADILACHANNA-GARI SRIKANTHAREDDY (My Old Name) to MUMMADIREDDY LAKSHMIREDDY GARI SREEKANTH REDDY (My New Name)..
AJT -2018

WANTED
తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని 20 ఏళ్ళ అనుభవం కలిగిన ప్రముఖ షోరూం నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు అసిస్టెంట్ మేనేజర్ కావలెను. సంప్ర. : 93936 01541
AJT - 187480

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18k.
Ph: 9160900024, 9640400073 AJH-16372

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

కలగానే.. కల్వర్టుల నిర్మాణాలు

- తాత్కాలిక మరమ్మతులతో కాలయాపన
- శాశ్వత నిర్మాణాలు ఎప్పుడో : స్థానికులు
- నిధులు మంజూరయ్యాయి : అధికారులు



పాపాఘ్ని నదిపై కొట్టుకుపోయిన బ్రిడ్జి (ఫైల్ ఫొటో)



బొంతవారిపల్లె వద్ద తాత్కాలికంగా నిర్మించుకున్న బ్రిడ్జి

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 28: భారీ వర్షాల కారణంగా కొట్టుకు పోయిన కల్వర్టులను మూడేళ్లవుతున్నా పునరుద్ధరించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని మండలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2021 అక్టోబర్, నవంబర్ మాసాల్లో కురిసిన భారీ వర్షాలకు టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె, జంబుగానిపల్లె, రంగసముద్రం పంచాయతీ బొంతవారిపల్లె సమీపంలో ఉన్న కల్వర్టులు తెగిపోయాయి. దీంతో అప్పట్లో 2 నెలల పాటు పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అటు తరువాత కొన్ని రోజులకు అధికారులు ఆయా కల్వర్టులకు తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాక పోకలు పునరుద్ధరించారు. అయితే, 2022 జూన్, జూలై, అక్టోబర్, నవంబర్ మాసాల్లో మళ్లీ భారీ వర్షాలు కురవడంతో ఆ కల్వర్టులు మళ్లీ కొట్టుకు పోయాయి. స్థానిక నాయకులు స్పందించి ఆ కల్వర్టులకు తాత్కాలికంగా మరమ్మతులు చేయించడంతో తాత్కాలికంగా ఊరట కలిగింది. అప్పటి నుంచి ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిస్తే కల్వర్టులు పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాపాఘ్ని నదిపై ఉన్న కల్వర్టు తెగిపోతే అవతల వైపు కర్ణాటక రాష్ట్రంలోని చేలూరుతో పాటు, మన రాష్ట్రంలోని గుంటిపల్లె, రేకలగుంటిపల్లె, జంబుగానిపల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు. అదే రంగసముద్రం గ్రామం బొంతవారిపల్లె కల్వర్టుతో బొంతవారిపల్లె నెటరాయునిపల్లె గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత నిర్మాణాలు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పాపాఘ్నిపై కల్వర్టు నిర్మించండి



వర్షాకాలంలో కల్వర్టుపైనుంచి ప్రయాణించాలంటే భయమేస్తోంది. కల్వర్టు తెగిపోతే, మండల కేంద్రానికి వెళ్లేందుకు సుమారు 35 కిలో మీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి ఉంటుంది. కనీసం ఇప్పటికైనా శాశ్వతంగా కల్వర్టులను నిర్మించి ఆదుకోవాలి.

\- సి. అంజనేయులు, చెన్నరాయునిపల్లె

20 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాలి



భారీ వర్షాలకు బొంతవారిపల్లె కల్వర్టు రెండు సార్లు కొట్టుకు పోయింది. ఒక్కసారి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. మళ్లీ కొట్టుకుని పోవడంతో శ్రమదానంతో పునరుద్ధరించుకున్నాం అధికారుల చుట్టూ తిరిగినీ ప్రయోజనం లేదు.

\- రాజేష్, బొంతవారిపల్లె

నిధులు మంజూరయ్యాయి

పాపాఘ్నిపై ఉన్న కల్వర్టు నిర్మాణానికి రూ. 7 కోట్లతో ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయి. మ్యాప్ డిజైన్ అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం బొంతవారిపల్లె కల్వర్టు నిర్మాణానికి రూ. 1.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం నిధులు విడుదలైతే పనులను ప్రారంభిస్తాం.

\- శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ అధికారి

ఆలేటిపల్లెలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

బి.కొత్తకోట, ఆగస్టు28: బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లెకు చెందిన ఓ యువతి (16)అదృశ్యమైనట్లు ఆమె తల్లి ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న యువతి ఈ నెల 27న కాలేజీకి వచ్చి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. యవతి తల్లి ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కురబలకోట, ఆగస్టు 28:అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కడప క్రాస్ పంచాయతీ తానామిట్ట వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

రామసముద్రంలో: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పుంగనూరు శ్రీనివాసపురం రోడ్డులో మంగళవారం రాత్రి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ని సీజ్ చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్ణయించిన రీచ్‌ల ద్వారా ఇసుక తెచ్చుకోవచ్చని ఎక్కడ పడితే ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రీచ్ నుంచి వచ్చే వాహనాలకు రసీదు తప్పనిసరిగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

16 మంది కోడిపందెం రాయుళ్లు అరెస్టు

- 23 ద్విచక్రవాహనాలు, రూ.20,700 నగదు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

గుర్రంకొండ, ఆగస్టు 28:కోడిపందెం రాయుళ్లపై పోలీసులు దాడులు నిర్వహించి 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ నగిరి సమీపంలోని పొలాల్లో భారీగా కోడిపందెం జరుగుతున్నట్లు జిల్లా ఎస్పీకి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పోలీసు అధికారులు కోడిపందెంపై చర్యలు తీసుకోవాలంటూ స్పెషల్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో చిన్నమండెం, గుర్రంకొండ, రాయచోటి పోలీసులు సంయుక్తంగా కోడిపందెంపై దాడులు చేసి 16 మంది పందెంరాయుళ్ల పట్టుబడుగా వారి వద్ద నుంచి రూ.20,700 నగదు, 23 ద్విచక్ర వాహనాలు, 6 కోడిపుంజులను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

13మంది జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్ ఆగస్టు 28: మదనపల్లె మండలం, కోళ్లబైలు పంచాయతీలో జూదం ఆడుతున్న 13 మందిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం రాత్రి కోళ్లబైలులో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి పట్టుకుని వారివద్ద నుంచి పేకాట కార్డులు, రూ. 15320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కలకడలో:జూదరులపై పోలీసులు దాడి చేసి 7 మంది అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని ముడియంవారిపల్లె సమీపంలోని పొల్లాలో జూదం ఆడుతుండగా ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులో 7 మంది జూదరులు పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.3500 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.



సీఎంను కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు



మదనపల్లె అర్బన్, ఆగస్టు 28: ఏపీ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును బుధవారం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రాజకీయ అంశాలపై సీఎంతో చర్చించారు. రాష్ట్రంలో జరుతున్న విషయాలను చంద్రబాబు నాయుడు దృష్టికి వివరించినట్లు తెలిపారు.

ఉపాధిలో పండ్లతోటలకు ప్రాధాన్యం

తంబళ్లపల్లె, ఆగస్టు 28: ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇచ్చి రైతులు సాగు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలని ఏపీవో అంజనప్ప సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్అసిస్టెంట్లు, ఎంటీఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ..ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు వ్యవసాయ పొలాల్లో ఉద్యాన పంటలు సాగుకు వీలు కల్పించడంతో పాటు వాటికి పెట్టుబడి వ్యయం కూడా మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం అందిస్తుందన్నారు. మామిడి, నిమ్మ, జామ, కొబ్బరి, సపోట, దానిమ్మ తదితర పంటలు సాగు ఉపాధి పథకంలో చేసుకోవచ్చన్నారు. తంబళ్లపల్లె మండలంలో ఈ ఏడాది 160 ఎకరాలు లక్ష్యమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మొగసాల గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో గంగమ్మతల్లి

గుర్రంకొండ, ఆగస్టు 28:మండలంలోని తరిగొండ బస్టాండులో నూతనంగా నిర్మించిన ఆలయంలో మొగసాల గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి



ప్రాజెక్టులను పోటీలలో ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కురబలకోట, ఆగస్టు 28: విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయడమే హ్యాకథాన్ ప్రధానోద్దేశ్యమని వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్ తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు హ్యాకథాన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కాగా 25బృందాలు వివిధ రకాల ప్రాజెక్టులను పోటీలలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మేమలత, షాహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కానిస్టేబుల్‌గా సిరాజ్‌బాషా



ప్రసంసా పత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఎస్పీ విద్యసాగర్‌నాయుడు

ములకలచెరువు, ఆగస్టు 28: విధి నిర్వహలో ఉత్తమ సేవలు అందించి ప్రతిభ చూపిన ములకలచెరువు కానిస్టేబుల్ సిరాజ్‌బాషా బుధవారం జిల్లా ఎస్పీ విద్యసాగర్‌నాయుడు చేతుల మీదుగా కమెండేషన్ డిస్క్ సర్టిఫికేట్‌ను అందుకున్నాడు. రాయచోటిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విద్యసాగర్‌నాయుడు సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు. ఉత్తమ కానిస్టేబుల్‌గా ప్రసంశా పత్రం అందుకున్న సిరాజ్‌ను సీఐ రాజరమేష్, ఎస్ఐ గాయత్రి, సిబ్బంది అభినందించారు.

పీటీఎం ఎస్ఐను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎస్ఐని సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్ద తిప్పసముద్రం ఆగస్టు 28 : ఇటీవల పెద్దతిప్పసముద్రం పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎం.కె నరసింహుడును బుధవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పీటీఎం మండల ఇన్‌చార్జ్ మల్లెల రవి అధ్వర్యంలో మండల, గ్రామస్థాయి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను శాలువ కప్పి పూల మాల లతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మల్లెల రవి, మబ్బు చంద్రలు మాట్లాడుతూ దళితులపై జరిగే దాడులను అరికట్టాలని కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించే విధంగా చర్యలు చేప ట్టాలని వారు కోరారు. ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు రామప్ప(పెద్దన్న), సీనియర్ నాయకులు వెంకటప్ప, చిన్నరామప్ప, నరసింహులు, శివన్న, గంగులప్ప, చెన్న కేశవ, వెంకట్రమణ, నరసింహులు, వెంక టేష్, శంకర, తుమ్మరకుంట గ్రామ అధ్యక్షులు నాగరాజు, బూర్లపల్లె నాగరాజు, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరిక బలిజలకు బీసీ-బీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

పీలేరు, ఆగస్టు 28: పీలేరు మండలంలోని పెరిక బలిజలకు బీసీ-బీ కులధృవీకరణ పత్రం మంజూరు చేయాలని జనసేన నాయకులు కామిశెట్టి సుధాకర్, రమణ తహసీల్దారు భీమేశ్వర రావును కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లగా అనేక మంది పెరిక బలిజ కులస్థులు వివిధ పనులు చేసుకుంటూ పీలేరు పట్టణంలో స్థిరపడ్డారన్నారు. కంప్యూటర్ల వ్యవస్థ రాకముందు వారికి శాశ్వత కులధృవీకరణ పత్రం లభించేదని, ఆ తరువాత రెవెన్యూ అధికారులు ఇవ్వడం లేదన్నారు. దీంతో చాలా మంది అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరం అవుతున్నారన్నారు. ఇకనైనా ఆ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

గ్రామీణుల ఆర్థిక బలోపేతమే ఎస్‌జీబీ లక్ష్యం

కలికిరి, ఆగస్టు 28: గ్రామీణ ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు జిల్లాలో సేవలందిస్తోందని ఆ బ్యాంకు జనరల్ మేనేజరు డి.ప్రబాహరన్ స్పష్టం చేశారు. మండలంలోని మహల్ గ్రామంలో ఎస్జీబీ నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఖాతాదారులు, డిపాజిటర్లు, ప్రజలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం జీవనజ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజరు పి.ప్రకాష్ రత్నబాబు సూచించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్ మొదలైన డిజిటల్ సేవలన్నీ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు మస్తానమ్మ, చుట్టుపక్కల శాఖల మేనేజర్లు, పలువురు సంఘమిత్రలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం



ఎంజేఆర్ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పీలేరు, ఆగస్టు 28: ఒకరి రక్తదానంతో మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ ఎం.పి.అవినాశ్ రెడ్డి తెలిపారు. ఆయన జన్మదినం సందర్భంగా బుధవారం ఎంజేఆర్ కళాశాల విద్యార్థులు పీలేరు ఏరియా ఆసుపత్రి, చిత్తూరు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. తన జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను ఛైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజ, సిబ్బంది మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



హెచ్‌ఐవిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తంబళ్లపల్లె, ఆగస్టు 28: సుఖ వ్యాధుల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, కృషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలుర పాఠశాలలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్ హెచ్‌ఐవి ఎలా వస్తుంది, వ్యాధి సంక్రమించకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ బాలాజి, కృషి సంస్థ అవుట్ రీచ్ వర్కర్ రేఖ, సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రంలో: రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీల ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. సమాజ శ్రేయస్సు కోసం గ్రామాల్లో ప్రతి ఒక్కరికి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించా లన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డెప్ప, రాజేశ్వరి, ఓబు లేష్, గాయత్రి, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న దివ్యాంగులు

మదనపల్లె అర్బన్ ఆగస్టు 28: స్థానిక మిషన్ కాంపౌండ్‌లో శాంతి సదన్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి దివ్యాంగులకు, వృద్ధులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మౌలాలి, ఈశ్వరీ, నరసింహులు, నాగరాజా, మునిరాజా, భీమయ్య, థామస్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 28: ప్రతి ఒక్కరూ వారి వారి ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ సూచించారు. ఇటీవల డెంగ్యూ కేసులు నమోదైన దిగువపల్లెలో బుధవారం ఎంపీడీవో పర్యటించారు. గ్రామంలో కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించి అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఇళ్ల వద్ద, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్థానిక ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌళాలి, కార్యదర్శి రమణ, వైద్యురాలు ఆశాలత, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాలపై ఆర్డీవో విచారణ



పీలేరు లక్ష్మీపురంలో విచారణ చేస్తున్న ఆర్డీవో రంగస్వామి

పీలేరు, ఆగస్టు 28: ఎస్సీ కులధ్రువీకరణ పత్రాల జారీ అంశంపై రాయచోటి ఆర్డీవో రంగస్వామి బుధవారం పీలేరు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విచారణ నిర్వహించారు. గతంలో వలంటీర్ల వ్యవస్థ ఉన్నప్పుడు పీలేరు పట్టణం లక్ష్మీ పురం, సరోజినీదేవి వీధి, గాజుల వెంక టప్ప సందు, జేకే నగర్ ప్రాంతాల్లోని పలు చిరునామాలతో చాలా మంది ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోల క్షేత్రస్థాయి పరిశీలనలో ఆయా దరఖాస్తుల్లో పలు తప్పులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారు ఆ విషయాన్ని పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు ద్వారా ఆర్డీవో రంగస్వామికి తెలియజేశారు. దీంతో ఆయన ఆయా దరఖాస్తుల్లోని చిరునామాల ఆధారంగా బుధవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంలో పెద్దఎత్తున ఎస్సీ కులధ్రువీకరణ కోసం దరఖాస్తులు వచ్చి ఉండడంతో నిజనిర్ధారణ కోసం తాము విచారణ జరిపామని ఈ విచారణలో చాలా దరఖాస్తుల్లో కనబరిచిన చిరునామాలు, ఎస్సీ ధ్రువీకరణ కోసం జతపరిచిన పత్రాలు సరిగ్గా లేకపోవడం గమనించామన్నారు. కొన్నిచోట్ల వలంటీర్లు అత్యుత్సాహం, మరికొన్ని చోట్ల దరఖాస్తుదారులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల తప్పులు దొర్లినట్లు తెలిసిందని తెలిపారు. తమ విచారణ సారాంశాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వర రావు, వీఆర్వోలు శిల్ప, కవిత, మాలమహానాడు నాయకులు మల్లిఖార్జున, సుభాష్ పాల్గొన్నారు.

బైవోల్టిన్ పట్టు పురుగుల పెంపకం ప్రయోజనకరం



పట్టుసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిరికల్చర్ అధికారులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 28 : బైవోల్టిన్ పట్టుపురుగుల పెంపకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సిరికల్చర్ ఏఎస్‌వో శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మదుమూరు గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో బుధవారం స్థానిక సర్పంచ్ నాగరత్నమ్మ, భాస్కర్‌నాయుడు అధ్యక్షతన సిరికల్చర్ ఏఎస్‌వో శ్రీకాంత్ రైతులతో మాట్లాడుతూ మల్బరీ పంటసాగు చేసే పట్టు రైతులకు పట్టు పరిశ్రమ ద్వారా ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నదన్నారు. రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన (ఆర్‌కెవివై) కార్యక్రమంలో భాగంగా పట్టు రైతులకు మల్బరీ మొక్కలు నాటుకోవడానికి, పట్టు పురుగులను మేపుకోవడానికి షెడ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి 50 శాతం సబ్సిడీతో సహాయం అందిస్తుందన్నారు. మల్బరీ తోటలకు కావాల్సిన యంత్రాలను సబ్సిడీతో అందిస్తుందన్నారు. బైవోల్టిన్ పట్టు సాగుపై ప్రతి రైతు ముందుకు వచ్చి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రమణ, పంచాయతీ కార్యదర్శి సుమలత, విలేజ్ సిరికల్చర్ ఆఫీసర్ మురళిమోహన్‌లతో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

స్వలాభాలు పక్కనపెట్టి పార్టీ కోసం పనిచేయండి

ములకలచెరువు/బి.కొత్తకోట, ఆగస్టు 28: స్వలాభాలను పక్కనపెట్టి పార్టీ కోసం పనిచేయాలని కురబలకోట, తంబళ్లపల్లె మండల టీడీపీ అధ్యక్షులు వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, మస్తాన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాయంలో బుధవారం జరిగిన తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డిపై కొందరు నాయకులు విజయవాడకు వెళ్ళి తప్పుడు ఫిర్యాదులు చేయడం తగదన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రజల కోసం పని చేసే వారు కావాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గంజిమోహన, చావిడికిట్టన్న, పట్టాచంద్రమోహన్‌రెడ్డి, తెట్టుమారెప్ప, మగ్గాలరవీంద్ర, విశ్వనాథరెడ్డి, జయచంద్రనాయుడు, సుధాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మోహన్‌రెడ్డి, శివరాంరెడ్డి, కాశిపల్లిసుబ్బారెడ్డి, రామచంద్ర భజంత్రి రామాంజులు, శ్రీనివాసులు, దేవప్పకోట సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి అంగన్‌వాడీలు కృషిచేయాలి



అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సీడీపీవో సుజాత

రామసముద్రం, ఆగస్టు 28: పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందించడంతో పాటు బాల్య వివాహాలు అరికట్టడం, మహిళలపైజరిగే అఘాయిత్యాల నివారణ తదితర సామాజిక బాధ్యతల పై అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సీడీపీవో సుజాత సూచించారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో బుధవారం జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళల సంరక్షణ కోసం ఉమెన్ హెల్ప్ లైన్ ద్వారా కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. బాధిత మహిళలను అన్ని విధాలా ఆదుకోడానికి ఉమెన్ హెల్ప్‌లైన్ సహాయపడుతుందన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయాలని, మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని, ప్రీస్కూల్ నమోదు హాజరు శాతాన్ని పెంచాలని ప్రీస్కూల్ నమోదు హాజరు శాతాన్ని పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకాంతమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కురబలకోట జడ్పీహైస్కూల్ నిధుల స్వాహాపై విచారణ



జడ్పీహైస్కూల్‌లో నిధుల స్వాహాపై విచారణ చేస్తున్న ఉపవిద్యాధికారి

కురబలకోట, ఆగస్టు 28: మండలంలోని కురబలకోట జడ్పీహైస్కూల్‌లో నాబార్డు నిధులతో జరిగిన పనులలో నిధుల స్వాహాపై ఉపవిద్యాధికారి పురుషోత్తం బుధవారం విచారణ చేపట్టారు. కాగా హైస్కూల్‌లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల్లో అవినీతి జరిగిందని విద్యా కమిటీ ఛైర్మన్ రఫీ, టీడీపీ నేతలు రాఘవ రెడ్డి, రెడ్డిశేఖర్, శ్రీనివాసులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఈవో విచారణ చేపట్టాలని డీవైఈవోను ఆదేశించడంతో విచారణ చేపట్టిన ఆయన మరుగుదొడ్లు, అసంపూర్తి నిర్మాణాలను పరిశీలించి జరిగిన నిర్మాణాల కన్నా రూ.లక్షలు అదనంగా డ్రా చేసినట్లు విచారణలో వెలుగుచూసింది. దీనిపై నివేదికను డీఈవోకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈవిచారణలో ఎంఈవో ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలు పరిష్కరించుకోండి



రెవెన్యూ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిమ్మనపల్లి, ఆగస్టు 28: మండలంలో భూ సమస్యలు ఎదుర్కొంటున్న భూ బాధితులు సంబంధిత భూ పత్రాలతో రెవెన్యూ సదస్సులకు హాజరై వాటిని పరిష్కరించుకోవాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోతో పాటురెవెన్యూ అధికారులు, స్థానిక పోలీసుల అధ్వర్యంలో భూ సమస్యలు కలిగిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధనంజేయులు మాట్లాడుతూ ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులకు విక్రయించినప్పుడు, భూమిపై సంబంధమే లేకుండా థర్డ్ పార్టీ అమ్మినప్పుడు, భూమికి సంబంధించిన వ్యక్తులు కాకుండా ఇతరులు విక్రయాలు చేసినప్పుడు రెవెన్యూ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. దీనికి కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారిపల్లి చెందిన కొందరు వ్యక్తులు హాజరై వారి సమస్యలను అధికారులకు తెలిపారు. భూ సమస్య జటిలం కావడంతో సమావేశాన్ని 15రోజులు తరువాత నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ నవయుగనాధ్ పాల్గొన్నారు.

'మదనపల్లెలో ఆవులు, పందులు సంచరిస్తే చర్యలు'

మదనపల్లె టౌన్, ఆగస్టు 28: మదనపల్లె పట్టణంలో ఆవులు, పందులు సంచరిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రమీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పలు కూడళ్లలో, నివాస ప్రాంతాల మధ్య, ప్రధాన రోడ్లలో ఆవులు సంచరించకుండా సెప్టెంబరు 10వ తేదీ లోపు వాటి యజమానులు వారి ఇంటి ఆవరణలో షెడ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే రోడ్లపై సంచరించే ఆవులను గోశాలకు తరలిస్తామన్నారు. అలాగే మున్సిపల్ పరిధిలో పందులు సంచారం లేకుండా వాటి యజమానులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పందులను పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందుల షెడ్లను వేసి పెంచుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 20వ తేదీ తరువాత పట్టణంలో పందులు సంచరిస్తే వాటిని పట్టుకుని దట్టమైన అడవుల్లో వదిలేస్తామని కమిషనర్ తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు28: ఆర్టీసీ వన్ డిపోలో ప్రతిభ కనపర్చిన ఉత్తమ ఉద్యోగులకు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి రాము బుధవారం ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సమన్వయంతో ఆర్టీసీకి ఆదాయం చేకూరేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి, అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, తదితరులు పాల్గొన్నారు.